



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 265 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 16 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-


డిజిటల్ గవర్నెన్స్‌లోనూ

# గూగుల్ భాగస్వామ్యం

- వివిధ రంగాల్లో గూగుల్‌తో కలిసి పని చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్
- ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు... సప్లై చైన్ సిటీ నిర్మాణానికి విస్తృత అవకాశాలు
- యూఎన్ హాబిటాట్ సెంటరాఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆహ్వానం
- సింగపూర్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు




**సింగపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** వివిధ రంగాల్లో సంయుక్తంగా పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ నిర్ణయించాయి. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ మేరకు జరిగిన చర్చల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి ఇరువురు వచ్చారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామి కావాలని కరణ్ బజ్వాను ముఖ్యమంత్రి కోరారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గూగుల్ ఆసియా - పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడితో జరిగిన సమావేశంలో వివిధ కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు. మరోవైపు ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని ముఖ్యమంత్రి కోరారు. ఆధునిక క్లౌడ్ సాంకేతికతలను వినియోగించుకుని రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలనేది తమ సీఎం వివరించారు. అలాగే ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని... దీనికి గూగుల్ నుంచి సహకారం కావాలన్నారు. ఇదే కాకుండా వైద్యసేవలు అందించే విషయంలో సాంకేతికను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ సంజీవని ప్రాజెక్టు అమలు చేస్తున్నట్ట ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టులో గూగుల్ సంస్థ భాగస్వామి కావాలని కోరారు. ఇక డేటా సెంటర్లకు, వివిధ పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ కోసం తాము గ్రీన్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్టు సీఎం వివరించారు. ఈ మేరకు గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను గూగుల్ ప్రతినిధి కరణ్ బజ్వాకు చంద్రబాబు చెప్పారు.

**లాజిస్టిక్స్ రంగంలో అపార అవకాశాలు**

సింగపూర్ వేదికగా సీఎం చంద్రబాబు జరిపిన వరుస మిగతా .. 2లో..

విభజన శక్తులపై

# ఐక్యంగా పోరాడాలి

ఢిల్లీలో జనసేన పార్టీ సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపు
కాక్రోచ్ జనతా పార్టీపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సుమతీ శతకంతో పోలిక!
చీమల చేతిలో బలమైన పాము కూడా చనిపోతుందని వ్యాఖ్య



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఢిల్లీలో జనసేన పార్టీ నిర్వహించిన 'సేన ప్రస్థానం-జాతీయ సమైక్యత కోసం' సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న శక్తులను తక్కువ అంచనా వేయకూడదని, అవి బలమైన ప్రభావాన్ని చూపగలవని సుమతీ శతకాన్ని ఉటంకిస్తూ వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతి, నిరుద్యోగం, విద్యావ్యవస్థలోని లోపాలను నిరసిస్తూ యువత సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన ఉద్యమమే మిగతా .. 2లో..

60 ఏళ్ల వయసులో ఏపీ లాసెట్‌లో

## 9వ ర్యాంకు సాధించిన బొప్పన నాగమల్లేశ్వరరావు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** చదువుకు వయసు అడ్డుకాదని మరోసారి నిరూపిస్తూ, 60 ఏళ్ల వయసులో ఏపీ లాసెట్-2026లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి బొప్పన నాగమల్లేశ్వరరావు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దపాలపర్రు గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు ఇటీవల ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం నరసాపురంలో ఉంటున్నారు. పదవీ విరమణ అనంతరం మిగతా .. 2లో..

నాసిరకం మద్యంతో నలభై వేల మంది మహిళలను

## వితంతువులుగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే

రాష్ట్ర అబ్కారీ, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర - దేశంలో అతిపెద్ద కుంభకోణం రాష్ట్రంలో జరిగిన లిక్కర్ స్కామ్
చవక ధరలకు నాణ్యమైన మద్యం - కేజీలను అధికమించటంతో పదిశాతం ఆదాయం పెంపుదల



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** నాసిరకం మద్యం ద్వారా దాదాపు నలభై వేల మంది మహిళలను వితంతువులుగా మార్చిన ఘనత గత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర అబ్కారీ, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కాలేయం, మూత్రపిండాలు చెదిపోయి వేలాదిమంది ఆనారోగ్యం పాలయ్యారని విమర్శించారు. దేశంలోనే అతి పెద్ద స్కామ్‌గా వైసిపి ప్రభుత్వ హాయాంలో జరిగిన ఎపి లిక్కర్ స్కామ్ నిలిచిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం నాటి విధ్వంసం నుండి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం వేదికగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి పలు విషయాలను వెల్లడించారు. దశల వారిగా మద్యనిషేదం చేస్తామని, ఫైవ్ స్లార్ హోటల్స్‌కే మద్యం మిగతా .. 2లో..

## పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం

రెండేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచలేదు, మూడేళ్లలో పెంచేది లేదు - రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
పెట్టుబడిదారులను తరిమేసిన చరిత్ర జగన్ రెడ్డిది - ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతూ, దుష్ప్రచారాలు చేయడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పార్టీ నీచ రాజకీయాలు చేస్తుందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నరసరావుపేటలో సోమవారం నిర్వహించిన కూటమి రెండేళ్ల విజయోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. అలాగే డీఆర్డీఏ, వెలుగు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మిగతా .. 2లో..

నటుడు ప్రకాష్ రాజ్‌పై

## తిరుపతి కోర్టులో ఫిర్యాదు

- రామాయణం, శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ
- బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఈ ఫిర్యాదు దాఖలు



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్‌పై తిరుపతి కోర్టులో సోమవారం క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. రామాయణం, హిందూ దేవతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు భక్తుల మనో భావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు జి.భానుప్రకాశ్ రెడ్డి ఈ ఫిర్యాదు చేశారు. తిరుపతిలోని నాలుగో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌తో పాటు పలు బహిరంగ వేదికలపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉత్తర భారత దేశం నుంచి వచ్చిన శ్రీరాముడు, లక్ష్మణుడు దక్షిణాదిపై (లంకగా పోలుస్తూ) దండయాత్ర చేశారని, మిగతా .. 2లో..

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ దిశగా

## తొలి బోర్డు సమావేశం

ఏ.పి. ఫిలిం, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం తొలి బోర్డు సమావేశం సోమవారం విజయవాడ ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించామని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్ తెలిపారు. సమావేశానికి కార్పొరేషన్ ఛైర్మన్ పి.భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, డైరెక్టర్లు వై.ఝాన్సీ, సుమన్ తల్వార్, మిగతా .. 2లో..

రాష్ట్ర శ్రేయస్సు కోసం

## లోకేష్, బ్రాహ్మణి దంపతుల రుద్రాభిషేకం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వారు మహాశివుడికి ఈ పూజలు చేశారు. పవిత్రమైన సోమవారం సందర్భంగా, వేద పండితుల మార్గదర్శకత్వంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి, శ్రేయస్సు, ప్రజా సంక్షేమం కోసం పరమశివుడి ఆశీస్సులు మిగతా .. 2లో..

ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

## విందుకు హాజరైన విజయ్, రష్మిక

- విందు ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న రఘురామ
- సొంత గ్రామంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన విజయ్ దేవరకొండ



**విశ్వం వాయిస్ న్యూస్ :** టాలీవుడ్ కొత్త జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తాజాగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇచ్చిన విందుకు హాజరైంది. రఘురామకృష్ణరాజు స్వయంగా విజయ్, రష్మికలను తమ కుటుంబ సభ్యులతో కలిసి డిన్నర్‌కు ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అనంతరం వారితో దిగిన ఫొటోలను ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్నారు. "ఈ సాయంత్రం ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలకు వారి కుటుంబ సభ్యులతో పాటు మా ఇంట్లో ఆతిథ్యం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. అద్భుతమైన వ్యక్తులతో సరదాగా మాట్లాడటం, వారితో గడిపిన సమయం మరపురానిది" అంటూ ఆయన ట్వీట్ చేశారు. రఘురామ ట్వీట్‌కు

మెట్రో ఫేజ్-2ను

## అడ్డుకుంది ఆ ముగ్గురే

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మిగతా .. 2లో..

బద్రీనాథ్ ఆలయానికి ముకేష్ అంబానీ

## రూ.10 కోట్ల విరాళం



**విశ్వం వాయిస్ న్యూస్ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) స్వాగతం పలికింది. అక్కడ మిగతా .. 2లో..

యోగా దినోత్సవం..

## కోల్‌కతాలో పాల్గొననున్న మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** యోగాతో ఆరోగ్యకర ఉపయోగాలను తెలియజేసే లక్ష్యంతో ఐరాస ఏటా జూన్ 21ని 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా గుర్తించి ప్రపంచవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ నేతృత్వం వహించి, యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు.'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే థీమ్‌తో ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### డిజిటల్ గవర్నెన్స్‌లోనూ

# గూగుల్ భాగస్వామ్యం

సమావేశాల్లో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై వైసీహెచ్ గ్రూప్‌తో సీఎం చర్చించారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఏపీలో 1,053 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని... లాజిస్టిక్స్ పరంగా పెట్టుబడులు పెట్టేందుకు అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం వివరించారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని... లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పని చేస్తున్నామంటూ ఏపీలోని లాజిస్టిక్స్ వసతులు.. ఉన్న వనరులను వైసీహెచ్ గ్రూప్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు రాష్ట్రంలో ఉద్యానరంగంలో రూ.1 లక్ష కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. ఆక్వాకల్చర్‌లో ఏపీ నెంబర్ 1 స్థానంలో ఉందని... ఆహార ఉత్పత్తులకు మరింత విలువ జోడించడం ద్వారా ఎగుమతులు పెరిగాయని వివరించారు. ఏపీని సందర్శించాలని... రాష్ట్రం అమలు చేస్తున్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టాలని వైసీహెచ్ గ్రూప్‌ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని, దీనికి భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. యూఎన్ హాబిటాట్‌తో సంపూర్ణ భాగస్వామ్యం కోరుకుంటున్నామని అనాక్లాడియాకు సీఎం తెలిపారు. దీనిపై యూఎన్ హాబిటాట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. యూనివర్శిటీల మధ్య భాగస్వామ్యం, ప్రణాళిక దశలో ఎస్డీజీలను చేర్చడం, ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్ సహకారం పైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాల సుస్థిర అభివృద్ధికి యూఎన్ హాబిటాట్ సహకారాన్ని సీఎం కోరారు. పట్టణాల్లో మురికివాడల అభివృద్ధికి పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రాం అమలుపై చర్చించారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్యస్థాయి నగరాల్లో అర్బన్ రాస్తా ఫ్రేమ్ వర్క్‌ను సంయుక్తంగా అమలు చేయాలని సీఎం ప్రతిపాదించారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం - స్థానిక ఆదాయ వనరులను పెంచేందుకు వాల్యూ కాప్చర్ ఫైనాన్సింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టడం - అంతర్జాతీయ వాతావరణ నిధుల సమీకరణ తదితర అంశాలపైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఈ సమావేశాల్లో మంత్రి నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఐక్యంగా పోరాడాలి

'కాక్రోచ్ జనతా పార్టీ'. ఈ పేరుతో పలుచోట్ల నిరసనలు కూడా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "సుమతీ శతకంలో చెప్పినట్లు బలమైన సర్పం కూడా చలిచీమల చేతిలో చిక్కి చనిపోతుంది. ఈ మధ్య కాలంలో పుట్టుకొచ్చిన కాక్రోచ్ పార్టీని చూడగానే నాకు సుమతీ శతకం గుర్తొచ్చింది" అని అన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులు సిద్ధంగా ఉన్నాయని, అటువంటి విభజనవాద ఆలోచనల్లో చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే ఢిల్లీలో సమావేశమయ్యామని పవన్ తెలిపారు. కోట్ల మంది కలిస్తే మంచి లేదా చెడు ఏదైనా బలమైన ప్రభావాన్ని చూపించగలరని పేర్కొన్నారు. విభజనవాదాన్ని సృష్టిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మనం అందులో భాగస్వాములం కాకుండా, ఐక్యంగా ఎదురొడ్డి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## 9వ ర్యాంకు సాధించిన బొప్పన నాగమల్లేశ్వరరావు

తనకు ఉన్న న్యాయ విద్యపై ఆసక్తితో మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం కోసం ఏపీ లాసెట్ పరీక్షకు హాజరయ్యారు. ఏపీఎస్‌సీహెచ్ఈ తరఫున తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ పరీక్షలో 100 మార్కులు సాధించి రాష్ట్రంలో 9వ ర్యాంకు పొందారు. వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి సాధించిన ఈ విజయం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. నాగమల్లేశ్వరరావు విజయంపై విద్యావేత్తలు, న్యాయవాదులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా లక్ష్యాలను సాధించవచ్చని ఆయన నిరూపించారు. తదుపరి న్యాయ విద్యను విజయవాడలోని సిద్ధార్థ లా కళాశాలలో అభ్యసించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## వితంతువులుగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే

పరిమితం చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వం తదుపరి చేతులెత్తేసారన్నారు. మద్యం ధరలను 75శాతం మేర పెంచి దోపిడి చేసారని, ఫలితంగా ఆ కాలంలో 2012 శాతం మేర నేరాలు పెరిగాయని పేర్కొన్నారు. ఎన్‌డిపిఎల్ వల్ల ఆదాయం కోల్పోయామని, అబ్కారీ శాఖను తమకు అనుకూలంగా ఉండేలా ముక్కలు చేసారని, ఫలితంగా ఎన్ఫోర్స్ మెంట్ లేకుండా పోయిందని వివరించారు. నిజానికి 2014-2019 మధ్య కాలంలో అదాయం పరంగా తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ కు మధ్య వ్యత్యాసం రూ.4,186 కోట్లు ఉండేదని, 2019-2024 మధ్య కాలానికి అది 42,762 కోట్లకు చేరిందని , ఇది కేవలం వైసిపి ప్రభుత్వం చేసిన అవినీతి విధానాల కారణంగానే జరిగిందని ఆరోపించారు. తమ అక్రమాల కోసం ఆన్ లైన్ లో సాగే అన్ని అంశాలను మాన్యువల్ కు మార్చారన్నారు. వైసిపి ప్రభుత్వం రాకకు ముందు రాష్ట్ర అబ్కారీ టర్నోవర్లో 51.21 శాతం వాటా మల్టీ నేషనల్ కంపెనీలకు ఉండగా, గత పాలకుల కాలంలో అది 5.25 శాతానికి పడిపోయిందన్నారు. ఉద్దేశ్య పూర్వకంగా అధికారం అండతో సాగించిన అక్రమ వ్యాపారానికి ఇది నిదర్శనమన్నారు. రూ.99,413 కోట్ల మేర నగదు రూపంలో మద్యం వ్యాపారం చేసారని, కేవలం 615 కోట్లు మాత్రమే డిజిటల్ చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాటి పరిస్థితులను అధికమిస్తూ ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని రూ.99 కే అందిస్తుందన్నారు. నూతన బార్ పాలసీ తీసుకువచ్చామన్నారు. సరిహద్దు రాష్ట్రాలలో పోల్చి చూసినప్పుడు మనవద్ద గరిష్ట చిల్లర ధర వ్యత్యాసం ఉండటంతో ఏర్పడ్డ రెవిన్యూ నష్టాన్ని అధికమించమన్నారు. నవోదయంతో ఐడి లిక్కర్ ను నియంత్రించామని కొల్లు రవీంద్ర వివరించారు. ప్రమాణాల మేరకు మద్యం ఉండేలా 4 ప్రాంతాలలో ల్యాబ్ లు ఏర్పాటు చేసి దాదాపు 13 రకాల పరీక్షలు చేస్తున్నామన్నారు. అరవై శాతం మేర మద్యం కొనుగోళ్లు డిజిటల్ పేమేంట్స్ ద్వారా జరుగుతున్నాయని, సురక్షా యాప్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. పూర్తి స్థాయి డిజిటలైజేషన్ దిశగా ముందడుగు వేస్తున్నామన్నారు. సిట్ చెబుతున్న దానిని అనుసరించి వైసిపి ప్రభుత్వ హాయాంలో రూ.3500 కోట్ల మేర జరిగిన ఎపి లిక్కర్ స్కామ్ దేశంలోనే అతి పెద్ద స్కామ్ గా నిలిచిపోయిందన్నారు. ఇప్పటికే 17 మందిని అరెస్టు చేసారని, రూ.260 కోట్ల రూపాయల అస్తులను అటాచ్ చేసారని తెలిపారు. 20 కోట్ల నగదును సైతం ఇప్పటికవరకు ఈ కుంభకోణంలో స్వాధీనం చేసుకున్నారని స్పష్టం చేసారు. మొత్తం వ్యవహారాన్ని తమ ప్రవేటు వ్యాపారంగా నడిపారన్నారు. పర్యాటక అవసరాలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకువస్తున్నామని, బీచ్ లలో ఏర్పాటు చేసే వ్యవస్థలు ఆకోవలోకే వస్తాయన్నారు. తాము ప్రజల ఆరోగ్యానికే ప్రాధ్యాన్యం ఇస్తున్నామని, కేవలం విభిన్న రకాల లీకేజీలను అడ్డుకోవటం వల్లే అదాయం పెరిగిందని రవీంద్ర పేర్కొన్నారు. ఈ సమావేశంలో అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, కమీషనర్ చామకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ పాల్గొన్నారు.

**కమీషనరేట్‌లో ఉన్నత స్థాయి సమావేశం**

తొలుత మంగళగిరి కమీషనరేట్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి రవీంద్ర హాజరయ్యారు. వివిధ జల్లాల నుండి వచ్చిన డిప్యూటీ కమీషనర్లు, సహాయ కమీషనర్లు, జిల్లా అబ్కారీ అధికారులకు మంత్రి దిశా నిర్ధేశం చేసారు. శాఖపై కొన్ని పత్రికలలో వస్తున్న అవాస్తవ కథనాలకు ఎప్పటికప్పుడు ఖండించాలని, ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో అయా జిల్లాల స్థాయిలో తగిన వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న 105 బార్ లకు సంబంధించి రీ నోటిఫికేషన్ ఇవ్వాలని, మద్యం అలవాటును తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. బెల్టు షాపుల నిర్వహణపై కఠిన చర్యలకు వెనుకాడవద్దన్నారు.

## పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం

సబ్సిడీపై ఆటోలను అందజేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించిన మంత్రి గొట్టిపాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ., ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి కూటమి కార్యకర్తలే ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుది అయితే., విద్యుత్ పెట్టుబడిదారులను రాష్ట్రం నుంచి తరిమేసిన నీచ చరిత్ర జగన్ ప్రభుత్వానిదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల కోసమే ఏడాదికి రూ.33 వేల కోట్లను వెచ్చిస్తోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున పింఛన్ల కోసం ఖర్చు చేయడం లేదని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కరోజే రూ.10 వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.8,900 కోట్లకు పైగా సహాయం చేశామన్నారు. విద్యార్థులు అందరికీ ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి, కేవలం ఒక్క బిడ్డకే అమ్మ ఒడి అమలు చేసినట్లు మంత్రి గొట్టిపాటి విమర్శించారు. ఇలా ఇచ్చిన ప్రతీ హామీని వైసీపీ ప్రభుత్వం తప్పిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్నఅవినీతి ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. వైసీపీ పాలనలో అమరావతి రాజధాని పనులు నిలిచిపోయాయని, 70 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు కూడా నిలిచిపోవడంతో రైతులకు సాగునీరు అందలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిలిచిపోవడం వల్ల 920 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం కూడా ఆగిపోయిందని తెలిపారు. వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, కోట్లాది రూపాయిలు అప్పులు తెచ్చి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపారని మంత్రి ఆరోపించారు. రెండేళ్ల కూటమి పాలనలో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విద్యుత్ భారం ప్రజలపై వేయలేదని, రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీల పెంపు ఉండదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. రాయలసీమతో పాటు పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, పల్నాడులో రెండు సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజలకు ఏవి అవసరమో అవన్నీ చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే కొత్త పెన్షన్లతో పాటు అర్హులకు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు.

## తిరుపతి కోర్టులో ఫిర్యాదు

ఇది ఆర్యుల-ద్రావిడుల విభజనను ప్రోత్సహించేలా ఉందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించినట్లు భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధంగా ఉండటమే కాకుండా, ఉద్దేశపూర్వకంగా మతపరమైన విశ్వాసాలను కించపరిచేలా మరియు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో వివరించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023లోని సెక్షన్ 299, 196 కింద కేసు నమోదు చేసి, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ప్రకాశ్ రాజ్ మాట్లాడిన వీడియో ఏప్రిల్ 17న తన దృష్టికి వచ్చిందని భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. రామాయణం, శ్రీరాముడు, లక్ష్మణుడి గురించి ఆయన మాట్లాడిన తీరు అత్యంత అభ్యంతరకరంగా ఉందని తెలిపారు. సమాజంలో విద్వేషాలు రగిల్చేలా, హిందూ దేవతలను మరియు పవిత్ర గ్రంథాలను నిందితుడు ఉద్దేశపూర్వకంగా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రకాశ్ రాజ్ చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో ఏప్రిల్‌లోనే భానుప్రకాశ్ రెడ్డి ఆయనకు లీగల్ నోటీసులు పంపారు. తన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. తాజాగా ఆయన చేసిన ఫిర్యాదును తిరుపతి కోర్టు విచారణకు స్వీకరించింది.

## విందుకు హాజరైన విజయ్, రష్మిక

రష్మిక కూడా స్పందిస్తూ.. "మాకు ఆతిథ్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు సర్, ఇది ఒక అద్భుతమైన సాయంత్రం" అని బదులిచ్చారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు విజయ్ దేవరకొండ తన సేవాగుణాన్ని చాటుకున్నారు. తన సొంత జిల్లా అయిన నాగర్ కర్నూలు జిల్లాలోని బల్మూర్ మండలం తుమ్మనపేటలో 'ది విజయ్ దేవరకొండ ఫౌండేషన్' తరఫున విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా హాజరుకావడం విశేషం. వీరితో పాటు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన 181 మంది విద్యార్థులకు వారు చెక్కులను అందజేశారు. ఫస్ట్ ర్యాంకు సాధించిన వారికి రూ. 10,000, సెకండ్ ర్యాంకు సాధించిన వారికి రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఒకవైపు రాజకీయ ప్రముఖులతో విందు, మరోవైపు సొంత ఊరిలో సేవా కార్యక్రమం.. ఇలా రెండు భిన్నమైన సందర్భాల్లోనూ విజయ్, రష్మిక జంటగా కనిపించడం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## తొలి బోర్డు సమావేశం

ఎస్.శివాజీ, చదలవాడ శ్రీనివాసరావు, బుర్రా సాయి మాధవ్, కందిమళ్ల సాంభశివరావు, వివేక్ కూచిభొట్ల, వి.సముద్ర, కే.ఉమామహేశ్వరరావు, ఎస్.వెంకట కృష్ణా రెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి.సత్యనారాయణ, దుర్గా ప్రసాద్ సాహులు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగాల సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. బోర్డు డైరెక్టర్ల సభ్యుల్లో ఒకరు చిక్కాల మెహర్ రమేష్ కుమార్ ను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేశామన్నారు. బోర్డు సమావేశానంతరం ఈజీఎమ్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ, చిత్రీకరణకు అనుకూల వాతావరణం కల్పించడం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ (రూట్ మ్యాప్) రూపొందించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులు, భవిష్యత్తులో నిర్వహించాల్సిన నంది అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివిధ అంశాలు, విధివిధానాలు, సూచనలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేయడంతో పాటు కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు ప్రోత్సాహం అందించేలా కార్పొరేషన్ కార్యాచరణ కొనసాగుతుందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తెలియజేశారు. సమావేశంలో ఏ.పి. ఫిలిం, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముడావత్ శ్రీనివాస్ నాయక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేష్, బ్రాహ్మణి దంపతుల రుద్రాభిషేకం

కోరుతూ ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. రుద్రాభిషేకం అనంతరం లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. రాష్ట్ర ప్రజల మేలు కోరుతూ మంత్రి దంపతులు ఈ పూజలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## అడ్డుకుంది ఆ ముగ్గురే

మాట్లాడారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. "రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా? కేసీఆర్, కేటీఆర్‌లతో కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## రూ.10 కోట్ల విరాళం

ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణకు రూ.10 కోట్లను విరాళంగా ప్రకటించారు. ముకేశ్ అంబానీ తన కుటుంబ సభ్యులలో కలిసి తొలుత బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లారు. ఆలయాభివృద్ధికి, యాత్రికులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ఆయన రూ.10 కోట్లను విరాళంగా ప్రకటించారని బీకేటీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సోహన్ సింగ్ రానా తెలిపారు. ఏటా బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలను ముకేశ్ అంబానీ సందర్శిస్తుంటారు. మరోవైపు చార్‌ధామ్ యాత్ర కొనసాగుతోంది. జూన్ 13 వరకు 12.23 లక్షల పైగా యాత్రికులు కేదార్‌నాథ్‌ను సందర్శించగా, బద్రీనాథ్ ఆలయాన్ని 10.92 లక్షల భక్తులు సందర్శించారు.

## కోల్‌కతాలో పాల్గొననున్న మోదీ

నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని జాదవ్ పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారని తెలిపారు. 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్' సమన్వయంతో, విదేశాల్లోని 210కి పైగా భారత మిషన్లు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,500 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**మోదీ అభ్యర్థన మేరకు...**

యోగాను విశ్వవ్యాప్తం చేసే ఉద్దేశంతో భారత ప్రధాని నరేంద్ర మోదీ 2014, సెప్టెంబరు 27న ఐక్యరాజ్య సమితి (ఐరాస) జనరల్ అసెంబ్లీ 69వ సెషన్ ప్రారంభోత్సవంలో ఏటా జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరపాలని అభ్యర్థించారు. అదే ఏడాది డిసెంబరు 11న ఈ తీర్మానానికి 177 సభ్య దేశాల ఆమోదం లభించింది. దీంతో 2015 నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా యోగా డేను నిర్వహించుకుంటున్నారు.

### రెండేళ్లలో మహిళా, శిశు, గిరిజన సంక్షేమ రంగాల్లో

# అపూర్వ ప్రగతి

**రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ రంగాలను అత్యున్నత ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి గత రెండు సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమం అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని, ప్రతి మహిళకు భద్రత, ప్రతి చిన్నారికి పోషకాహారం, ప్రతి గిరిజన కుటుంబానికి అభివృద్ధి అవకాశాలు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి బలహీన వర్గానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాల కాలంలో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలు లక్షలాది మంది జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరేలా, మహిళలు భయరహితంగా జీవించేలా, పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా, గిరిజనులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమాన్ని సాధికారతగా, అభివృద్ధిని సామాజిక న్యాయంగా, ప్రభుత్వాన్ని ప్రజల జీవితాల్లో విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడమే మా లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు 20 లక్షల మంది లబ్ధిదారులు ఈ సేవలను పొందుతున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా పోషకాహార సరఫరా కొనసాగించడంతో పాటు అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టామని చెప్పారు. అంగన్‌వాడీ సేవలను గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అందించేందుకు 5,389 మంది అంగన్‌వాడీ టీచర్ల నియామకం, 5,287 మంది ఆయాల నియామకం ద్వారా మొత్తం 11 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార పంపిణీ కేంద్రాలుగానే కాకుండా, చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో 10,000 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలు, ఆర్.ఓ. ప్లాంట్లు, భవన మరమ్మతులు, పారిశుధ్య సదుపాయాలు, వంట సామగ్రి, పచ్చదనం పెంపు కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ చేపట్టామని, దీనివల్ల ఇంధన పొదుపు, పరిశుభ్రత, సమర్థవంతమైన వంట ప్రక్రియ సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి ప్రసవానికి రూ.5,000, రెండో ప్రసవానికి రూ.6,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే తల్లిపాల ప్రోత్సాహం, పోషకాహార భద్రత, శిశు సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 371 ఆశ్రమ పాఠశాలలు, 199 గురుకులాలు, 179 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, 1,950 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో సహా మొత్తం 2,715 గిరిజన విద్యాసంస్థల ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, నోట్‌బుక్స్, బెడ్ షీట్లు, దుప్పట్లు, స్టేషనరీ కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. హాస్టళ్లు, పాఠశాలల్లో పరిశుభ్రత, పోషకాహారం, భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా కనిపించే సికిల్ సెల్ అనీమియా వ్యాధి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. లక్షలాది మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విశాఖపట్నంలో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిఫల్ సెక్రటరే ఎమ్.ఎమ్.నాయక్, రాష్ట్ర స్త్రీ శిశు, దివ్యాంగ, వృద్ధ, ట్రాన్సుజెండర్ సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు ఎం.వేణుగోపాల రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి, ఏ.పి.గురుకుల పాఠశాలల సెక్రటరీ గౌతమి, గిరిజన సంక్షేమ శాఖ సి.ఇ. వసంత తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## జాతీయ ప్రత్యామ్నాయ శక్తిగా జనసేన!

జాతీయస్థాయి విపక్ష నేతలను టార్గెట్ చేయడం: పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఏపీకి మాత్రమే పరిమితమైన జనసేన పార్టీ భవిష్యత్తులో జాతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగు తుందా? ఆ తరహాలో రాజకీయాలను వ్యూహాత్మకంగా ముందుకు తీసుకువెళ్లాలని పార్టీ అధినేత పవన్ నిర్ణయించారా? అంటే.. తాజా పరిణామాలను బట్టి ఔననే సమాధానమే వినిపిస్తోంది. ఢిల్లీ వేదికగా.. పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగంలోని విషయాలను పరిశీలిస్తే.. వ్యూహం గట్టిగానే ఉన్నట్టు తెలుస్తోందని విశ్లేషకు లు భావిస్తున్నారు.

1) జాతీయస్థాయి విపక్ష నేతలను టార్గెట్ చేయడం: పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీని మెడలు వంచుతామని ప్రకటించే నాయకులు.. ఇక్కడకు వచ్చాక మెడలు వంచుకుని వెళ్తారని వ్యాఖ్యానించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన మమతా బెనర్జీ.. ఓటమిని అంగీకరించకపోగా.. ఢిల్లీలో సత్తా చూపిస్తామని.. ఢిల్లీమెడలు వంచుతామని అన్నారు. అలానే.. గతంలో కేసీఆర్ కూడా.. ప్రభుత్వంలో ఉన్నప్పుడు.. ఇలాంటి ప్రకటనలే చేశారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సైతం ఇలానే వ్యాఖ్యానించారు. ఇప్పుడు వారి వ్యాఖ్యలను గుర్తు చేయడం ద్వారా.. ఢిల్లీని మెడలు వంచుతామని ప్రకటనలు చేసే నాయకులకు పవన్ చురకలు అంటించారు. ఇదేసమయంలో ఎవరు ఎవరి మెడలు వంచక్కర్లేదని.. జాతీయ సమగ్రత కోసం.. కలసి సాగితే చాలన్న సందేశాన్ని ఇచ్చారు.

2) చిన్నపార్టీలని అనుకోవద్దని హెచ్చరించడం: ఇక, తన ప్రసంగంలో కాక్రోచ్ జనతా పార్టీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కూడా.. జాతీయ ప్రత్యామ్నాయ శక్తిగా జనసేన అవతరించే అవకాశం ఉందన్న సందేశాన్ని పవన్ కల్యాణ్ ఇచ్చినట్టు అవుతుంది. చిన్నపార్టీలే కదా.. అని అనుకోవద్దన్న హెచ్చరిక స్పష్టంగా కనిపించింది. కాక్రోచ్క కూడా ఇలానే ప్రారంభమైందని.. కానీ.. ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిందని పేర్కొన్నారు. తద్వారా.. తమది కూడా.. చిన్నపార్టీనే అయినా.. దేశంలో విస్తరించేందుకు ఎలాంటి సంకోచాలు లేవన్న సంకేతాలు పంపినట్టు అయింది.

3) తటస్థులకు వేదికగా మారడం: ఇక, తటస్థులకు వేదికగా కూడా.. జనసేనను మలిచే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. జాతీయ సమగ్రత నినాదం వెనుక.. తటస్థులను.. దేశ భక్తి, దేశం కోసం ఏదైనా చేయాలని భావించే వారిని తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది.



ప్రస్తుతం కాక్రోచ్ పార్టీ ఆవిర్భావం వెనుక.. తటస్థులనే కీలక ఆయుధంగా మార్చుకున్నారు. ఇప్పుడు అదే మంత్రాన్ని పవన్ కూడా పఠించనున్నారన్నది సుస్పష్టంగా తెలుస్తోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం...

## తీవ్ర గాయలతో మూడవ తరగతి విద్యార్థి


**ఎడ్యుకేర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, గెద్దాడ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మూడో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు...**





**రాజోలు / గెద్దాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** గెద్దాడలోని ఎడ్యుకేర్ ఇంగ్లీషు మీడియంలో చదువుతున్న మూడో తరగతి విద్యార్థిని స్కూల్ బస్సు లో ఇంటిదగ్గర దిగే సమయంలో... పొదలాడ మెయిన్ రోడ్ వద్ద రోడ్డు దాటే ప్రయత్నంలో ఉండగా ఢీ కొన్న వేగంగా వచ్చిన బుల్లెట్ వాహనం.. ఈ ప్రమాదంలో బాలుడు ఎగిరిపడి తీవ్రంగా గాయపడి, కాళ్లు విరగడంతో పాటు తలకు కూడా తీవ్ర గాయాలు.... తీవ్ర గాయలతో ప్రస్తుతం అమలాపురంలోని శ్రీనిధి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు.. స్కూల్ బస్సులో డ్రైవర్‌తో పాటు తప్పనిసరిగా క్లీనర్ లేదా అటెండర్ లేకపోవడం ఈ ప్రమాదానికి ప్రధాన కారణం.. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ , విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న స్కూల్స్ యాజమాన్యాలు...... ఇంటి దగ్గరే పిల్లల పికప్, డ్రాపింగ్ ఉంటుందని చెప్పి స్కూల్ బస్సుల కోసం ఫీజుల మీద ఫీజులు వసూళ్లు.... ఫిటినెస్ లు మాత్రమే కాదు.... బస్ లో డ్రైవర్ లతో పాటు క్లినర్ లేదా అటెండర్ లు ఉన్నార లేరా అని చూడరా రవాణా శాఖ...? ఫీజులు మీద మాత్రమే శ్రద్ధ చూపే యాజమాన్యాలు.... పిల్లల భద్రత మీద కూడా శ్రద్ధ చూపిస్తే మంచిదని పలువురు అభిప్రాయం..

## భర్తకు గుండెజబ్బు.. సెక్స్ కోరికలు తీర్చలేడని భార్య ఘాతుకం




**సర్పవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనురాగ బంధానికి ఆ ఇల్లాలు మంగళసూత్రం సాక్షిగా ప్రమాణం చేసింది. కానీ, క్షణిక సుఖాల వ్యామోహంలో పడి ఆ పవిత్ర బంధాన్ని నడిరోడ్డుపై తెంచేసింది. అనారోగ్యంతో ఉన్నాడన్న జాలి కూడా లేకుండా, కట్టుకున్న భర్తను అత్యంత దారుణంగా కడతేర్చింది. గుండెపోటు మరణంగా కలరింగ్ ఇచ్చి తప్పించుకుందామనుకున్న ఆ కిరాతకురాలి పాపం ప్రియుడి ఎంట్రీతో కటకటాలపాలైంది. ఈ విషాద ఘటన కాకినాడ జిల్లా సర్పవరంలో తీవ్ర కలకలం రేపింది. సర్పవరం సీఐ బి.ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో మండపం కాలనీకి చెందిన పుల్ల దుర్గాప్రసాద్ (35) ఆటో నడుపుతూ భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం దుర్గాప్రసాద్ గుండెలో స్టంట్లు వేయడంతో ఇంటికే పరిమితం అయ్యాడు. భర్త రోజురోజుకు అచేతనంగా మారుతుండటంతో భార్య రమాదేవి కోరికలు మితిమీరిపోయాయి. ఈ క్రమంలో బాపట్లకు చెందిన ప్రసాదం గోపిసాయితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, వివాహేతర సంబంధానికి దారితీసింది.అతడు తరచూ బాపట్ల నుంచి సర్పవరం వచ్చి రమాదేవిని తీసుకుని రామచంద్రపురం, విజయవాడ తదితర ప్రాంతాలకు షికారు తిప్పేవాడు. భార్య వ్యవహారంపై అనుమానం వచ్చిన దుర్గాప్రసాద్ నిలదీసి మంచి పద్ధతి కాదని, ప్రవర్తన మార్చుకోవాలని మందలించాడు. తమకు అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకునేందుకు ప్రియుడితో కలిసి పన్నాగం పన్ని నిద్రమాత్రలతో అంతమొందించాలని పథకం వేసింది. ప్రియుడు గోపిసాయి బాపట్ల నుంచి 15 నిద్ర మాత్రలు కొనుగోలు చేసి దేవికి ఇవ్వడంతో మార్చి 13న ఉదయం ఖర్జూర జ్యూస్‌లో వాటిని వేసి భర్తతో తాగించింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన భర్తను దిండుతో ముఖంపై అదిమి పట్టుకుని ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. అనంతరం ఏమీ తెలియనట్లు భర్తకు గుండెపోటు వచ్చి పడిపోయాడని బంధువులకు చెప్పడంతో వారు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే భర్త చనిపోయి మూడు నెలలు గడవక ముందే రమాదేవి పాత ప్రియుడిని వదిలి.. కొత్త ప్రియుడిని వెతుక్కోవడంతో బాపట్ల బాబుకు కోపం వచ్చింది. అంతే.. ఈ నెల 9న 'మీ అమ్మ జ్యూస్‌లో నిద్రమాత్రలు కలిపి ఇచ్చి ఊపిరాడకుండా చేసి మీ నాన్నను చంపేసింది' అని రమాదేవి కుమార్తె ఫోన్‌కు గోపిసాయి మెసేజ్ చేశాడు. దీంతో హత్య వ్యవహారం బయటపడింది.

## టీవీ సీరియల్ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య



**విశ్వం వాయిస్ న్యూస్ :** టీవీ సీరియల్ నటి సంచితా (22) ఉగాలే ముంబైలోని నాలాసొపారాలో.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కుమ్‌కుమ్ భాగ్య సీరియల్‌లో కీలక పాత్ర పోషించి.. పాపులర్ అయిన సంచితా ఉగాలే. బ్లాక్‌బస్టర్ సినిమా 'ఛావా'తో పాటు సైలెన్స్-2 చిత్రంలోనూ నటించింది సంచితా. ఉరేసుకున్న సంగతి గుర్తించి కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా.. అప్పటికే చనిపోయిందని వైద్యుల నిర్ధారణ. సంచితా సూసైడ్ చేసుకోవడానికి గల కారణాలేంటి? అనే విషయాలపై దర్యాప్తు పోలీసులు చేస్తున్నారు.

## సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో చోరీ

### పోలీసుల కాల్పులు



**బాపట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టు నుంచి కాకినాడ పోర్ట్‌కు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలులో దొంగలు చోరీకి పాల్పడగా.. పోలీసులు కాల్పులు జరపడం కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.15 గంటల సమయంలో బాపట్ల శివారు నల్లమడ వాగు రైల్వే వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్-3, ఎస్-6 బోగీల్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళల నుంచి ఏడు సవర్ల బంగారు ఆభరణాలు దొంగిలించారు. చైన్ లాగడంతో రైలు నిలిచిపోయింది. దొంగలు రైలు దిగి పొలాల మీదుగా బాపట్ల-గుంటూరు రోడ్డు వైపు పారిపోతుండగా.. ఎస్కార్ట్ విధుల్లో ఉన్న రైల్వే పోలీసులు 9 రౌండ్లు కాల్పులు జరిపారు. దుండగుల కోసం అప్పికట్ల- బత్తిపూడి పొలాల్లో గాలిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు గ్రామీణ పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ ఘటనలో ఆరుగురు దుండగులు పాల్గొన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

**రెండు నెలల వ్యవధిలో..**

గత ఏప్రిల్ 19వ తేదీ వేకువజామున అప్పికట్ల సమీపంలోని బెంగళూరు - నర్సాపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లో నిద్రిస్తున్న మహిళల మెడల్లో నుంచి 130 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు.

మూడు వారాల క్రితం బాపట్లకు సరిహద్దులో ఉన్న గుంటూరు జిల్లా నిడుబ్రోలు సమీపంలో సిగ్నల్స్‌ను దొంగలు టాంపరింగ్ చేసి.. చోరీకి యత్నించారు. రైల్వే పోలీసులు అప్రమత్తమై దాదాపు ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలోనూ దొంగలను పట్టుకోలేకపోయారు. రెండు నెలల్లో మూడు వరుస చోరీలు 20 కి.మీ. పరిధిలోనే జరగడం గమనార్హం.

ఒకే కుటుంబానికి చెందిన


## ముగ్గురి అనుమానాస్పద మృతి

**సంగం, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ఘోరం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సంగం మండలం దువ్వూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు (65), ఆయన భార్య రత్నావళి (60), కుమారుడు సాయిసుకృత్ (25) ఇంట్లోనే ఉరివేసుకొని ఉన్న స్థితిలో మృతి చెందారు. చేతులకు తాళ్లు కట్టేసి ఉండటంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనాస్థలిలో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## క్రెడిట్ కార్డులతో సైబర్ నేరాలు

### వినియోగదారులకు ఐ4సీ హెచ్చరిక

**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో సైబర్ నేరాలు రోజుకో కొత్తరూపం దాలుస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు అక్రమ నగదు మార్పిడి కోసం క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని భారత సైబర్‌క్రైం సమన్వయ కేంద్రం (ఐ4సీ) వెల్లడించింది. ముంబయిలో ఇటీవల ఇదే తరహా ఘటనలు వెలుగుచూశాయి. భారీ స్థాయిలో క్రెడిట్ కార్డు బకాయిలు ఉన్న వ్యక్తుల్ని గుర్తించి, వారి బిల్లులను తామే చెల్లిస్తామని సైబర్ నేరగాళ్లు ఆశ చూపుతున్నట్లు విచారణలో తేలింది. వీరు ఫిషింగ్, పెట్టుబడి మోసాలు, ఇతర సైబర్ నేరాల ద్వారా దోచుకున్న సొమ్మును క్రెడిట్ కార్డు ఖాతాల్లో జమ చేస్తున్నారు. చెల్లింపులు పూర్తయిన తర్వాత కార్డు యజమానుల నుంచి సమాన మొత్తంలో నగదును తీసుకుంటున్నారు. ఇలా డిజిటల్ రూపంలో దోచుకున్న డబ్బును నగదుగా మార్చుకుని అక్రమ లావాదేవీల జాడలను చెరిపేస్తున్నారు. దీంతో అసలు నేరస్థులను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు మరింత కష్టంగా మారుతోంది. క్రెడిట్ కార్డు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఐ4సీ సూచించింది. బిల్లులు చెల్లిస్తామని, కమిషన్లు ఇస్తామని సంప్రదించే వారిని నమ్మొద్దని హెచ్చరించింది. ఇదే సమయంలో పశ్చిమాసియా సంక్షోభాన్ని అడ్డం పెట్టుకుని ఎల్పీజీ బుకింగ్‌లు, ప్రభుత్వ సబ్సిడీల పేరుతో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలూ పెరిగినట్లు వెల్లడించింది. యుద్ధ పరిస్థితుల వల్ల ఇంధన కొరత ఏర్పడుతుందని, ఎల్పీజీ ధరలు పెరుగుతాయని భయపెడుతూ ప్రజలకు నకిలీ సందేశాలు పంపిస్తున్నారు. ఈ సందేశాల్లో ఇచ్చే లింకులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా వినియోగదారులను నకిలీ వెబ్‌సైట్లకు మళ్లిస్తున్నారు. సబ్సిడీ పొందాలంటే వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇవ్వాలని, చిన్న మొత్తాన్ని వెరిఫికేషన్ ఫీజుగా చెల్లించాలని కోరుతున్నారు.



# తుని మిస్సింగ్ మిస్టరీ

## పొలాల్లో కాకినాడ ఎస్పీ బింధు మాధవ్ శోధన - 'జాను' కేసులో హై అలర్ట్!

**'భైరవుడు' మృతి చెందిన అడవి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ.. దర్యాప్తుపై కీలక ఆదేశాలు**
**కుక్క మరణం వెనుక కుట్ర కోణంపై ఫోకస్.. సాంకేతిక ఆధారాలతో నిందితుల కోసం వేట ముమ్మరం!**



**తుని రూరల్, జూన్ 15 (విశ్వం వాయిస్ న్యూస్ నెట్‌వర్క్):** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జాను) కేసులో సోమవారం అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. శనివారం చిన్నారి పెంపుడు కుక్క 'భైరవుడు' అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కాకినాడ జిల్లా ఎస్పీ జీ.బిందు మాధవ్ స్వయంగా రంగంలోకి దిగారు. సోమవారం ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని, చిన్నారి అదృశ్యమైన తోటలను, పెంపుడు కుక్క మరణించిన అడవి పరిసర ప్రాంతాలను అంగుళం అంగుళం క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్పీ స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు రావడంతో పోలీస్ యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది.

### అసలు ప్రశ్నలు ఇవే..??

పాప మిస్సైన రోజే అదృశ్యమైన కుక్క.. మూడు రోజుల తర్వాతే ఎందుకు తిరిగి వచ్చింది?

ఇంటికి వచ్చిన తర్వాత కూడా అన్నం ముట్టకుండా దేనికోసం తహతహలాడింది?

పోలీసులు జీపీఎస్ ట్రాకర్ కట్టిన రెండు రోజులకే అది ఎందుకు చనిపోయింది?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరికితేనే జాను మిస్టరీ వీడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో ఎస్పీ విచారణ..**
**అధికారులకు దిశానిర్దేశం**

పెద్దపురం డీఎస్పీ ఏబీజీ తిలక్, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావులతో కలిసి ఎస్పీ బిందు మాధవ్ గాలింపు చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. దట్టమైన పామాయిల్ తోటల్లోని భౌగోళిక పరిస్థితులను, మనుషులు తిరగడానికి వీల్లేని ముళ్ళపొదలను ఆమె పరిశీలించారు. డ్రోన్ కెమెరాల ద్వారా సేకరించిన విజువల్స్‌ను రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులు గణేష్, భవానిలను ఎస్పీ పరామర్శించి, ధైర్యం చెప్పారు. పాప ఆచూకీ కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

**కుక్క మరణంపై ఫోరెన్సిక్ ఫోకస్:**
**విషప్రయోగం జరిగిందా?**

చిన్నారి ఆచూకీ కనుగొనడంలో ఏకైక ఆధారంగా నిలిచిన పెంపుడు కుక్క అకస్మాత్తుగా మృతి చెందడంపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. కేసును పక్కదారి పట్టించడానికి లేదా ఆధారాలు దొరకకుండా చేయడానికి ఎవరైనా దానికి లివిషప్రయోగంలి చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుక్క కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అధికారులు, నివేదిక కోసం నమూనాలను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపించారు. ఈ రిపోర్ట్ వస్తే కుక్క మరణానికి గల అసలు కారణాలు వెల్లడవుతాయని ఎస్పీ పేర్కొన్నారు.

**జీపీఎస్ రూట్ మ్యాప్ విశ్లేషణ**

కుక్క చనిపోవడానికి ముందు దాని మెడకు అమర్చిన లిజీపీఎస్ ట్రాకర్ రికార్డ్ చేసిన శాటిలైట్ డేటానులి సైబర్ క్రైమ్ విభాగం విశ్లేషిస్తోంది. ఆ మూగజీవి బుధవారం నుండి శనివారం వరకు అడవిలో ఏయే నిర్దిష్ట ప్రాంతాలకు వెళ్ళింది? ఎక్కడ ఎక్కువ సమయం ఆగింది? అనే రూట్ మ్యాప్ ఆధారంగా.. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టి బలగాలు గాలింపును కేంద్రీకరించాయి.

**'కిడ్నాప్' కోణంలో ముమ్మర విచారణ.. జాతీయ రహదారిపై సీసీటీవీల స్క్రీనింగ్!**

కుక్క మరణంతో చిన్నారి అడవిలో తప్పిపోయిందనే కోణం కంటే, ఎవరైనా కావాలనే ఆమెను అపహరించారనే అనుమానాలు బలంగా మారుతున్నాయి. కేవలం పామాయిల్ తోటలు, కొండ ప్రాంతాలకే పరిమితం కాకుండా పోలీసులు తమ దర్యాప్తు పరిధిని పెంచారు.

జూన్ 6వ తేదీ (పాప మిస్సైన రోజు) నుంచి తుని పరిసర ప్రాంతాల్లోని బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పెట్రోల్ బంకులు, హోటళ్ళ సీసీటీవీ ఫుటేజీలను ప్రత్యేక బృందాలు సేకరించి జల్లెడ పడుతున్నాయి. జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రకటించిన రూ. 1,00,000 (లక్ష రూపాయల) నగదు బహుమతి ప్రకటనను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళు_న్నారు.


సాంకేతిక ఆధారాలు (జీపీఎస్ & సీసీటీవీ) మరియు హ్యూమన్ ఇంటెలిజెన్స్ (అమానితుల విచారణ)తో ఈ మిస్టరీని త్వరలోనే ఛేదిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### కన్నీరు వత్తని కన్నపేగు!

"మా పాపను దొంగిలించిన వారే మా కుక్కను కూడా చంపేసి ఉంటారు సార్.. మా జాను ఎక్కడుందో చూసి చెప్పండి" అంటూ చిన్నారి తల్లి భవాని, తండ్రి గణేష్‌లు చేస్తున్న రోదనలు వింటుంటే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. వారం రోజులు దాటినా కూతురు క్షేమ సమాచారం తెలియకపోవడంతో ఆ పేద దంపతులు ప్రాణాలొదిలే స్థితికి చేరుకున్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 16 జూన్, 2026




www.viswamvoice.com

# డంపింగ్ చెత్తతో కాలనీవాసుల కష్టాలు

## గొల్లపుంత కాలనీ వాసుల ఆరోగ్యం అంటే అధికారులకు ఇంత నిర్లక్ష్యమా??



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో గొల్ల పుంత కాలనీలో ప్రతిరోజు సత్తెమ్మ తల్లి గుడి వెనక గల కాలనీవాసుల చెత్తను డంప్ చేసే ప్రదేశంలో తరచూ చెత్తకు నిప్పు పెడుతున్నారని పేదవాడి కాలనీలు అంటే ఇంత చులకన అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. నిప్పు పెట్టడం వల్ల దట్టమైన పొగ పరిసర ప్రాంతాలను కమ్మేస్తోందని, కళ్ల మంటలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదురవు తున్నాయని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. సమీపంలోని ఇళ్లలో నివసించే ప్రజలు, పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని తీవ్రంగా ఖండించారు.ఈ సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. కాలనీవాసుల చెత్తను డంపు చేసే ప్రదేశంలో తరచూ చెత్తకు నిప్పు పెట్టకుండా ఎప్పటికప్పుడు ఈ చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. దీనిపై స్థానిక శాసనసభ్యులు దృష్టి సారించాలని కోరారు.

65 మంది పేద విద్యార్థులకు

# రూ.6.30 లక్షల ఆర్థిక సాయం పంపిణీ

### చల్లా శంకర్రావు సేవలను కొనియాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు గౌరవ వేతనం రూ.6.30 లక్షల ఆర్థిక సహాయాన్ని 65 మంది విద్యార్థులకు అందజేశారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు చేతుల మీదుగా ఈ సహాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో చల్లా శంకర్రావు, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని అన్నారు. సమాజంలో పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి సహకరించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ గా చల్లా శంకర్రావు అందరికీ ఆదర్శప్రాయంగా సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నష్టాల్లో కూరుకుని పోయిన ఆర్యాపురం బ్యాంకును లాభాల బాట పట్టించడానికి ఆయన పడిన కష్టం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు గత పాలకులు ఆయనపై ఎన్ని నిందలు మోపిన తట్టుకుని నిలబడి ఈరోజు బ్యాంకుని, ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఆయనకు సహకరిస్తున్న బ్యాంకు పాలకవర్గ సభ్యులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. చల్లా శంకర్రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 32 లక్షల రూపాయలు తన గౌరవ వేతనాన్ని విద్యార్థులకు స్కాలర్షిప్స్ అందించడం జరిగిందన్నారు. బ్యాంకు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని, ఎన్ని అవరోధాలు ఎదురైనా సంస్థను మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో మరింత మందికి సహాయ సహకారాలు అందించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కష్టపడి చదువుకున్నప్పుడే మంచి భవిష్యత్తు లభిస్తుందని ఆ మేరకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పంతం కొండలరావు మాట్లాడుతూ సిటీ నియోజకవర్గాన్ని మంచి సమర్థవంతమైన నాయకత్వంతో ఆదిరెడ్డి వాసు నడిపిస్తున్నారని అన్నారు. ఆర్యాపురం బ్యాంకును జాతీయ బ్యాంకుల కంటే మెరుగైన సేవలు అందించే విధంగా తీర్చిదిద్దడానికి చల్లా శంకర్రావు అనునిత్యం కృషి చేస్తున్నారని అన్నారు. ఎక్కడ ఎటువంటి అవినీతి, అవకతవకలు జరగకుండా పారదర్శకంగా సేవలు అందిస్తున్న ఆర్యాపురం బ్యాంకు పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు యేనుముల రంగబాబు, పిల్లి శ్యామ్ కుమార్, సింగంపల్లి రామకృష్ణ, కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాసరావు, బుడ్డిగ రవి, ఎర్రమోతు ధర్మరాజు, యాళ్ల వెంకటరావు, ముదిగి శ్రీనివాసరావు, నీలపాల సత్యనారాయణ (పండు), తురకల నిర్మల, చల్లా కేశవ, చల్లా మురళి, బ్యాంకు సీఈవో గోడ సుధాకర్, తాడేలి శ్రీనివాస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కేశవరంలో డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు

### ఘటన స్థలాన్ని పరిశీలించిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు



**కేశవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం కేశవరంలో డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలకు పశువుల పాక దగ్ధమైంది. గ్రామంలోని పల్లపు వీధిలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక ఉన్న డంపింగ్ యార్డుకు ఆదివారం రాత్రి నిప్పు పెట్టడంతో మంటలు ఎగసిపడ్డాయి. సోమవారం ఉదయం సంఘటన స్థలానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకన్నబాబు తో మాట్లాడుతూ డంపింగ్ యార్డులో తరచూ చెత్తకు నిప్పు పెడుతున్నారని ఆరోపించారు. దీంతో దట్టమైన పొగ పరిసర ప్రాంతాలను కమ్మేస్తోందని, కళ్ల మంటలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదురవు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోని ఇళ్లలో నివసించే ప్రజలు, పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంకన్నబాబు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఇక్కడ నుండి తొలగించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. చెత్త ట్రాక్టర్ రాకుండా అడ్డుకట్ట వేయండనీ చెప్పారు. ఏ ఇబ్బంది వచ్చిన తాను అండగా ఉంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వుండమట్ల శ్రీ శ్రీ, అల్లంపల్లి కిశోర్, రాయపాటి సత్యనారాయణ, వుండమట్ల శ్రీను, అబ్బిరెడ్డి వీర్రాజు, మనుమర్తి యేసురాజు, పురంశెట్టి శ్రీను, మాచిరెడ్డి సురేష్, మన్నే ఉమా, తవిటికి మహేష్, బుత్తల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలో విలీనం

### బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల మూర్తి హర్షం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ను దేవాదాయ శాఖలో విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల మూర్తి స్వాగతించారు. దీనికి చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ చేసిన కృషిని బ్రాహ్మణ జాతి ఎప్పటికీ మరచిపోదన్నారు. కార్పొరేషన్ దేవాదాయ శాఖలో వీలీనం అవ్వటం ద్వారా బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం మరింత వేగవంతం అవుతుందని ఆశిస్తున్నాను అని, అర్చకులు,వేద పండితులు, పురోహితులకు సంబంధించిన పథకాలు ఒకే వ్యవస్థ ద్వారా అందుబాటులోకి రావడం వల్ల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం భావించిందని, ఈ నిర్ణయంపై బ్రాహ్మణ వర్గాల నుంచి కూడా సానుకూల స్పందన వస్తున్నట్లు తేజోమూర్తుల తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేసిందని, వైసీపీకి చెందిన కొంతమంది బ్రాహ్మణ నాయకులు కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలో విలీనాన్ని వ్యతిరేకించి బ్రాహ్మణులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఇలాంటి పద్ధతులు వైసీపీ ఇకనైనా మానుకోవాలని తెలియజేశారు. మరొకసారి కార్పొరేషన్ ను దేవాదాయ శాఖలో విలీనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్‌కు, బోర్డు డైరెక్టర్లకు, కార్పొరేషన్ అధికారులకు, సొసైటీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజమండ్రిలో సెల్‌ఫోన్ చోరుల వీరంగం

### పట్టపగలే ద్విచక్రవాహనాలపై చోరీలు
### సహాయం అడిగి జర్నలిస్ట్ దగ్గర సెల్‌ఫోన్ చోరీ
### రాజమండ్రిలో కొత్త తరహా మోసంతో యువకుల పరార్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నగరంలో సెల్‌ఫోన్ చోరులు పట్టపగలే ద్విచక్రవాహనాలపై సంచరిస్తూ ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అమాయకులను మోసం చేస్తూ చాకచక్యంగా సెల్‌ఫోన్లు అపహరిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో జెఎన్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి కొంతదూరం వెంబడించినట్లు సమాచారం. అనంతరం అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో శ్యామలానగర్ జంక్షన్ నుంచి తిలక్ రోడ్డులోకి వస్తుండగా, ఓ యువకుడు చెప్పుల షోరూమ్ సమీపంలోని ఫుట్‌పాత్ వద్ద ద్విచక్రవాహనం కింద పడిపోయి ఉన్నట్లు కనిపించాడు. "బండి పైకి తీయండి.. రక్షించండి" అంటూ సహాయం కోరడంతో, అక్కడుగా వెళ్తున్న వ్యక్తి స్పందించి వాహనాన్ని పైకి లేపేందుకు ప్రయత్నించాడు. అయితే, ఇదంతా ముందస్తుగా పన్నిన పథకమని తర్వాత తెలిసింది. బాధితుడు సహాయం చేస్తున్న సమయంలో వెనుక నుంచి మరో యువకుడు వేగంగా వచ్చి అతడిని పక్కకు నెట్టి, చొక్కా పై జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను అపహరించాడు. అనంతరం ఇద్దరు యువకులు అదే ద్విచక్రవాహనంపై తిలక్ రోడ్డు నుంచి వీఎల్‌పురం వైపు వేగంగా పారిపోయారు. ఈ ఘటనతో నగరంలో భద్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అపరిచితులు సహాయం కోరిన సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# వైసీపీలో చేరిన అంగర టిడిపి నాయకులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీకి వీడ్కోలు చెప్పారు. వైసీపీ గ్రామ అధ్యక్షుడు అసిరబాబు ఆధ్వర్యంలో సోమవారం మండపేట పట్టణంలోని విజయలక్ష్మి నగర్లో ఉన్న వైసీపీ కార్యాలయంలో గంగుమళ్ళ శ్రీను, చిలుకూరి గంగారావు, సిద్దిరెడ్డి సతీష్‌లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైసీపీ లోకి జాయిన్ అయ్యారు. ఎమ్మెల్సీ తోట వారికి పార్టీ కండువాలు మెడలో వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, గ్రామంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ కారణంగానే టీడీపీని వీడి వైసీపీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీకి ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారికి పూర్తి స్థాయి గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కపిలేశ్వరపురం మండల పార్టీ కన్వీనర్ గూటం సత్యనారాయణ, సలా సుబ్రహ్మణ్యం, అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, చిల్లా లోవరాజు, కర్రీ శివశంకర్, మాజీ ఎంపీటీసీ పుప్పల కాశి తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పలు కుటుంబాలకు రాజా పరామర్శ




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో శ్రీరంగపట్నం కోటి తదితరు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం శ్రీరంగపట్నంలో ఇటీవల మృతి చెందిన సాధే వెంకటలక్ష్మి,విజ్జన మోహన్ రావు, పొలమరశెట్టి మంగా తదితర కుటుంబసభ్యులను పరామర్శించి, మృతులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అదే గ్రామంలో అనారోగ్యతో బాధపడుతున్న గింజరాల వెంకట్రావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కోటి గ్రామంలో పలు కుటుంబాల పరామిసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కొండపల్లి దుర్గారావు,సూరిశెట్టి కుటుంబరావు, దాడి శ్రీను, ఎంపిటిసి తనకాల నూకరాజు, దాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో అన్ని మండలాలలో

# రైతు బజార్లు ఏర్పాటు చెయ్యాలి

### బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి




**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు జనతా వారధి కార్యక్రమంలో భాగంగా ప్రజలు పడుతున్న కష్టాలను సోమవారం పోలవరం జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ దినేష్ కుమార్ కు బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి,పోలవరం జిల్లా బీజేపీ జనతా వారధి కన్వీనర్ కుండ్ల కృష్ణారెడ్డి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ స్వప్న కుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు గిడ్డంగులు ఏర్పాటు చేసి, సామాన్య ప్రజలకు నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండేలా చూడాలని,తక్షణమే అన్ని మండలాల తహసీల్దార్ లు గ్రామపంచాయతీ అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని, ఏజెన్సీ 12 మండలాల్లోనూ రైతు బజార్లను ఏర్పాటు చేయాలని, వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు, వచ్చే గిరిజనలకు, గిరిజన మహిళలకు సరైన మరుగుదొడ్లు వసతులు లేనందున వెంటనే కల్పించాలని, పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో యువత సైబర్ మోసాలకు గురవుతున్నారని, సైబర్ నేరాలపై యువతకు అవగాహన సదస్సులు కల్పించి, నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని, పోలవరం జిల్లా డిఎస్పీ అశ్రఫ్ అలీకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవిపట్నం మండల అధ్యక్షులు కారం రామన్న దొర, బిజెపి నాయకులు అరగాటి వీరభద్ర రెడ్డి,పండు తదితరులు పాల్గొన్నారు.

# 993 కుటుంబాల ప్రజలకు త్రాగునీరు లేక అవస్థలు

### పెద్ది సినిమా డైరెక్టర్, హీరోలపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలి
### జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రాలు ఇచ్చిన ఏపీ ఆదివాసీ జేఏసీ బృందం



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం ఐటీడీఏ గ్రీవెన్స్ హాల్ నందు సోమవారం పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ కి ఏపీ ఆదివాసీ బృందం వినతి పత్రాలు అందజేసామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ పోలవరం జిల్లా,దేవీపట్నం మండల పరిధిలోని చిన్న రమణయ్య పేట గ్రామపంచాయతీ, దేవారం గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామస్తులైన దండంగి, గంగంపాలెం, మూలపాడు,తొయ్యేరు గ్రామాలలో సుమారు 993 కుటుంబాల ప్రజలకు త్రాగడానికి మంచినీళ్లు లేక మార్చి చివరివారం నుండి జూన్ మూడో వారం వరకు సుమారు మూడు నెలల నుండి మంచి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.మంచినీళ్లు తెచ్చుకునేందుకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇందుకూరుపేట గ్రామం వెళ్లి తెచ్చుకుంటున్నారు. బాలింతలు, వృద్ధులు, వికలాంగులు మంచినీళ్లు తెచ్చుకోవటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగు గ్రామాలకు కలిపి ఒకటే చేతి పంపు పని చేయడంతో గృహ అవసరాలకు వాడుకునే నీళ్లకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.కావున భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆదివాసీ ప్రజలు జీవించే హక్కును కాపాడాలని కోరుతూ పోలవరం జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మంచినీటి సమస్య పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇటీవల విడుదలైన పెద్ది సినిమా హీరో, దర్శకుని పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వినతి పత్రాలు అందజేశామన్నారు.అలాగే ఇటీవల విడుదలైన పెద్ది సినిమాలో ఆదివాసీ సమాజాన్ని అవమానపరిచి వారి మనోభావాలను కించపరిచేలా ఉన్న భాష, వివాదస్పద డైలాగులను తక్షణమే తొలగించి పెద్ది సినిమా హీరో,దర్శకుని పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగంలో ఆదివాసులకు ప్రత్యేక చట్టాలు హక్కులు సమాన అవకాశాలు కల్పిస్తే నేటి తరం వాటిని తుంగలో తొక్కుతుంది.కావున పెద్ది సినిమా డైరెక్టర్ బుచ్చిబాబు పై హీరో రామ్ చరణ్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నమోదు చేయాలని తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శరభవరం,దేవారం ఎంపిటిసి తుర్రం జగదీష్ దొర,మిర్తివాడ వీర రెడ్డి,కొమరం కృష్ణ దొర,చవలం విద్యాసాగర్ భారత్ ఆదివాసీ పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ ప్రచార కార్యదర్శి, కోసు సోమన్న దొర,ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,తుర్రం చంద్రరావు దొర మొదలైన వారు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో సుపరిపాలనకు రెండేళ్లు..

# సువర్ణాంధ్ర దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం: మంత్రి వాసంశెట్టి



**వెంకయాయపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని వెంకటాయపాలెంలో గల కళ్యాణ మండపంలో "సుపరిపాలనకు రెండేళ్లు - విజయోత్సవ సభ" ఘనంగా నిర్వహించారు. కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి తట్టుకోలేకే వైసీపీ నాయకులు నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి గట్టి తీర్పు ఇచ్చి (భూస్థాపితం చేసి) రెండేళ్లు పూర్తయిందని ఆ ఓటమిని గుర్తు చేసుకుంటూనే వైసీపీ నాయకులు ఇప్పుడు ర్యాలీలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాళ్లలో అమలు చేస్తూ భావితరాల భవిష్యత్తును మార్చేలా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డీఎస్సీ, రైతు భరోసా, మత్స్యకారుల సంక్షేమం, ఆటో డ్రైవర్లకు చేయూత, అన్న క్యాంటీన్లు వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది మంది ప్రజలకు లబ్ధి చేకూరుతోందని మంత్రి వివరించారు. వీటితో పాటు పెట్టుబడులు, నూతన పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు పెద్దపీట వేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తనపై, తన కుటుంబంపై వైసీపీ ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ చేస్తున్న విమర్శలను మంత్రి తీవ్రంగా ఖండిస్తూ.. "పిల్లి" కూతలు కూయడం కాదు దమ్ముంటే ప్రజాసేవలో పోటీపడాలని సవాల్ విసిరారు. సేవే శాశ్వతమని నమ్మే తమ కుటుంబం ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటుందని తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి గత రెండేళ్లలో భారీ స్థాయిలో నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు. రూ.250 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మరో రూ.150 కోట్ల పుష్కర నిధులతో మౌలిక వసతుల కల్పన చేపట్టబోతున్నామని.. మొత్తంగా రూ.400 కోట్లకు పైగా నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, ప్రజా సౌకర్యాల అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించామని వివరించారు. సమాజ సేవలో తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని వ్యక్తిగతంగా గత రెండేళ్లలో రూ.2.13 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రజలకు అందించడంతో పాటు సీఎస్ఆర్ (జూ=) నిధుల ద్వారా రూ.7 కోట్లకు పైగా తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. ప్రజలకు సహాయం చేయడం చేతకాని వారు ఇలాంటి విష ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ఈ సభలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు సరైన అవకాశాలు కల్పించలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయ, కానిస్టేబుల్ తదితర ఉద్యోగ నియామకాలను ఎన్నడూ లేని విధంగా అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తోందని చెప్పారు. అనంతరం బీజేపీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, మంత్రి సుభాష్ నాయకత్వంలో రాష్ట్రంలో నిజమైన సుపరిపాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజలు భయాందోళనలకు గురయ్యారని ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిశీలకులు మజ్జి పద్మావతి మాట్లాడుతూ మహిళలకు రాజకీయంగా 33 శాతం ప్రాతినిధ్యం కల్పించే దిశగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవడం చారిత్రాత్మకమని మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి రెండేళ్ల పాలన విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయవంతమైన సభలో కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, రాజలూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కే గంగవరం మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికోమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు, జాస్తి విజయలక్ష్మి, సిర్రా రాజ్‌కుమార్, వజ్రపు రాజేశ్వరి, బళ్లా లక్ష్మి, వయిట్ల గజలక్ష్మి, దోమ్మలపాటి విజయలక్ష్మితో పాటు భారీ సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమం కోసం ఎంపీ హరీష్ బాలయోగి చొరవ

## ఒడిశా అధ్యయన పర్యటనలో కార్మిక సమస్యలపై లోతైన







**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి సంబంధిత పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన పర్యటనలో భాగంగా ఒడిశా రాష్ట్రంలోని ఝూర్సుగూడ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, కార్మిక చట్టాల అమలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు, అలాగే సాంప్రదాయ చేతివృత్తులు మరియు అంతరించిపోతున్న కళల పరిరక్షణ, ప్రోత్సాహానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యుడిగా హరీష్ బాలయోగి కార్మికుల జీవన పరిస్థితులు, ఉపాధి భద్రత, సంక్షేమ పథకాల అమలు, సామాజిక భద్రతా వ్యవస్థల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా కార్మిక పరిపాలన శాఖ అధికారులు, ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపిఎఫ్ఓ), ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (ఈసిఐసి) ప్రతినిధులతో సమావేశమై కార్మికులకు అందుతున్న సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. అంతేకాకుండా బ్యాంక్ ఆఫ్ ఇండియా, బీఎస్ఎన్ఎల్, మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ సంస్థల యాజమాన్యాలతో సమావేశమై కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక కార్మికుల సమస్యలు, వేతన భద్రత, ఉద్యోగ హామీ, ఆరోగ్య రక్షణ, సంక్షేమ చర్యల సమర్థవంతమైన అమలుపై పలు సూచనలు చేశారు. కార్మికులకు ప్రభుత్వం రూపొందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ పర్యటనలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భూగర్భ బొగ్గు గని సందర్శన నిలిచింది. గనుల తవ్వక కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించిన హరీష్ బాలయోగి, ప్రతిరోజూ క్లిష్టమైన, ప్రమాదకర పరిస్థితుల్లో వేలాది మంది కార్మికులు తమ విధులు నిర్వహిస్తున్న తీరును దగ్గరగా అధ్యయనం చేశారు. గనుల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొనే సవాళ్లు, భద్రతా ప్రమాణాల అవసరం, ఆరోగ్య సమస్యలు, కుటుంబాల జీవన పరిస్థితులపై లోతైన అవగాహన కలిగిందని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి కార్మికులే వెన్నెముక అని పేర్కొన్న హరీష్ బాలయోగి, వారి సంక్షేమం, భద్రత, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన చర్యలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారికి మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం కోసం పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషిని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతను విస్తరించడం, సంప్రదాయ వృత్తులు మరియు కళాకారులకు ప్రోత్సాహం అందించడం వంటి అంశాలపై ఈ అధ్యయన పర్యటన ద్వారా విలువైన సమాచారం సేకరించినట్లు హరీష్ బాలయోగి తెలిపారు. కార్మికుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా స్థాయీ సంఘం తన కృషిని కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# పైప్‌లైన్ పనుల పేరిట ప్రజాధనం దుర్వినియోగం

## అధికారుల నిర్లక్ష్యంతో నరకయాతన పడుతున్న స్థానికులు







**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని శీలం వారి సావరం, రామాలయం వీధి, పితాని వారి వీధి ప్రాంతాల్లో మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ పనులు స్థానిక ప్రజలకు వరంగా మారాల్సింది పోయి శాపంగా మారాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కలిసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్ల నుంచి వెలికితీసిన మట్టి, రాళ్లు, వ్యర్థాలను సకాలంలో తొలగించకుండా నేరుగా డ్రైనేజీ కాలువల్లోకి తోసివేయడంతో గత వారం రోజులుగా మురుగునీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. కాలువలు మురుగునీటితో నిండిపోవడంతో వీధులన్నీ దుర్గంధంతో కంపుకొడుతున్నాయి. నిల్వ నీటి కారణంగా దోమల ఉధృతి విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధుల భయం ప్రజలను వెంటాడుతోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు, గర్భిణీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్ల ముందు మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండగా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. మరోవైపు పైప్‌లైన్ పనుల అనంతరం రహదారిని సక్రమంగా పునరుద్ధరించకపోవడంతో రోడ్లపై ఇసుక, మట్టి పేరుకుపోయి జారుడు పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పలువురు వాహనదారులు ఇక్కడ బైక్‌లపై నుంచి కిందపడి గాయపడ్డారు. ఇది చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రోజూ వందలాది మంది ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు ఈ మార్గంలో ప్రయాణించాల్సి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, దుమ్ము వాహనాలు వెళ్లేటప్పుడు సమీపంలోని ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ పనుల వెనుక పెద్ద ఎత్తున ప్రజాధన దుర్వినియోగం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ప్రాంతంలో సుమారు ఐదేళ్ల క్రితం లక్షలాది రూపాయల వ్యయంతో వాటర్ పైప్‌లైన్ నిర్మించారు. అయితే ఆ పైప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకుండానే ఇప్పుడు అది పనికిరాకుండా పోయిందని చెబుతూ మరోసారి కొత్త పైప్‌లైన్ వేయడం ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు వాడని పైప్‌లైన్ ఎలా పాడైంది పాత పైప్‌లైన్ పరిస్థితి ఏమిటి, ప్రజల డబ్బుతో వేసిన పనులు ఉపయోగించకముందే ఎందుకు నిరుపయోగంగా మారాయి కొత్త పనుల పేరిట మళ్లీ ప్రజాధనాన్ని ఖర్చు చేయడం వెనుక అసలు కారణం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడని పనుల కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ అదే ప్రజలను దుర్భర పరిస్థితుల్లోకి నెట్టడం అధికారుల పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, రాళ్లు, వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగించి మురుగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే రహదారిని పూర్తిగా శుభ్రపరిచి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని కోరుతున్నారు. దాంతో పాటు ఐదేళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్ ప్రస్తుతం చేపడుతున్న కొత్త పైప్‌లైన్ పనులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, ప్రజాధనం వృథా చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శీలం వారి సావరం వాసులు ఎన్. రామ్మోహన్ రావు, పిల్లి లక్ష్మీకాంతం, పిల్లి శ్రీనివాసు, సూరంపూడి వెంకటేశ్వరరావు, టేకుమూడి నాగ రమేష్, చిట్టూరి దుర్గాప్రసాద్, శీలం శ్రీను, సాయి కుమార్, మేడిశెట్టి స్వామి, సూరంపూడి ప్రసాద్, సిహెచ్ వెంకటకృష్ణ, కోశెట్టి చంద్రరావు, గుడాల లక్ష్మీనారాయణ, గుడాల నాగబాబు తదితర స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# పీజీఆర్ఎస్‌లో 283 అర్జీల స్వీకరణ

## అర్జీదారుల సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానమని, ప్రజల నుంచి వచ్చే అర్జీలకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారాలు చూపించి అవి తిరిగి రీఓపెన్ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి, డీఆర్ఓ బి. సుబ్బారావుతో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 283 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలని చెప్పారు. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా, వారికి సంతృప్తి కలిగే విధంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఏదైనా కారణాల వల్ల ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాలను లబ్ధిదారులకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పెన్షన్ పంపిణీ, రేషన్ బియ్యం, ఎల్పీజీ గ్యాస్ సరఫరా, ఆసుపత్రి సేవలు వంటి అంశాల్లో ఐవీఆర్ఎస్ సర్వేలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రజలకు సరైన స్పందన అందించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి మాట్లాడుతూ, అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి ప్రజలకు శాశ్వత పరిష్కారాలు అందించాలని కోరారు. మన మిత్ర యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి ఫిర్యాదులో నాణ్యత, శాశ్వతత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వచ్చిన ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది : సోము వీర్రాజు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసిన సందర్భంగా అమలాపురంలోని కాటన్ గెస్ట్ హౌస్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ ఆధ్వర్యంలో సోము వీర్రాజు మీడియా సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సోము వీర్రాజు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు సొంత ఇళ్ల కలను సాకారం చేస్తున్నారని, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎరువులపై సుమారు రూ.1.25 లక్షల కోట్ల సబ్సిడీ అందిస్తున్నామని, యూరియా బస్తాపై వేలాది రూపాయల సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. దేశంలోని 80 కోట్ల మందికి ఉచిత బియ్యం అందించడం ద్వారా పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బేటీ బచావో--బేటీ పడావో, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశ ప్రగతికి నిదర్శనమని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విమానాశ్రయాల విస్తరణ వంటి మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. దేశ భద్రత విషయంలో కూడా మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, సర్జికల్ స్ట్రైక్స్, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, రామ మందిరం నిర్మాణం వంటి నిర్ణయాలు చారిత్రాత్మకమని అన్నారు. జి 20 న్యూ ఢిల్లీ సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారతదేశ ప్రతిష్ట ప్రపంచ స్థాయిలో మరింత పెరిగిందన్నారు. అంతర్జాతీయ పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కొనే నాయకత్వ సామర్థ్యం నరేంద్ర మోదీకి ఉందన్నారు. ప్రపంచంలో ఆర్థికంగా 13వ స్థానంలో ఉన్న భారత్, నరేంద్ర మోదీ నాయకత్వంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. భారతదేశాన్ని కాపాడే శక్తి భారతీయ జనతా పార్టీకే ఉందని, ప్రజల విశ్వాసం బీజేపీ వైపే ఉందని సోము వీర్రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాసరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే మా ప్రాధాన్యత



## జిల్లా ఎస్పీ (అడ్మిన్) ఏవీఆర్‌పీబీ ప్రసాద్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ (అడ్మిన్) ఏవీఆర్‌పీబీ ప్రసాద్ (ఎన్‌సీ) స్వయంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ (అడ్మిన్) ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. సోమవారం కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ (అడ్మిన్) ఏవీఆర్‌పీబీ ప్రసాద్ (ఎన్‌సీ), జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


రాష్ట్ర విభజన గతం, విభజన తీరును

# రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారు

## పవన్ కళ్యాణ్‌ని విమర్శించడం తెలంగాణ నాయకులకు ఫ్యాషన్‌గా మారింది



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండుగా విభజించడం గత చరిత్ర రాష్ట్రాన్ని విభజించిన తీరు, విభజిత ఆంధ్రప్రదేశ్ కి జరిగిన అన్యాయాన్ని ప్రతి ఒక్క రాష్ట్ర పౌరుడు గుర్తుంచుకుంటారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విభజనను ప్రశ్నించలేదే విభజన తీరును తప్పుపట్టారు. పవన్ వాదనతో విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ఏకీభవిస్తారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని గుర్తించుకోవడం, ప్రశ్నించుకోవడం మా హక్కు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పవన్ కళ్యాణ్ పట్ల వ్యవహరిస్తున్న తీరు శోచనీయం తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తెలంగాణ వ్యతిరేకులు విభజనను ప్రశ్నిస్తే ఊరుకోం అంటున్నారు. పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి సినీ నటుడు అని సంబోధిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ జనసేన పార్టీ అధ్యక్షుడు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఆయనను చులకన చేసే విధంగా మాట్లాడడం తెలుగు ప్రజలందరినీ అవమానించడమే ప్రాంతీయత కన్నా నేషన్ ఫస్ట్ అన్న పవన్ కళ్యాణ్ మాటల్లో తప్పేముంది. దేశంలో ఎక్కడైనా పర్యటించొచ్చు, సభలు జరుపుకోవచ్చు రాజ్యాంగం ఇచ్చిన హక్కు, పవన్ కళ్యాణ్ పట్ల తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం అని ముత్యాల బాబ్జి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ కొత్తపేట మండల టీడీపీ అధ్యక్షుడు కడలి భీమేశ్వరరావు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు క్లస్టర్ కో ఇంఛార్జి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలి

## కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి అర్జిని సమగ్రంగా పరిశీలించి నాణ్యతతో కూడిన పరిష్కారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, సీపీవో పి త్రినాథ్, డీఆర్డీఏ పీడీ జి శ్రీనివాసు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎల్డీవో పి వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 347 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వివిధ శాఖలలో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణిత గడువులోపు తగిన పరిష్కారాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. అర్జీలు పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తొలుత జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్ని మండలాల తహశీల్దార్లు ఎంపీడీవోలతో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతి, సర్ ఇతర కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

**రెవెన్యూ క్లినిక్‌కు 49 అర్జీలు**

రెవిన్యూశాఖలో సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలుపైన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి టి. తిప్పేనాయక్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి రత్నమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్ లైన్ లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 49 అర్జీలు అందాయని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో రెవెన్యూ క్లినిక్ అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి ఈ అర్జీలను సకాలంలో పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమాలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఈ విద్యా సంవత్సరంలో ప్రయివేటు పాఠశాలలలో చదువుకునే 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యవర్గం కోరింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ కి కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్ సీనియర్ జర్నలిస్ట్ అంజిబాబు,కార్యవర్గ సభ్యులు ఆకెళ్ళ శ్రీనివాస్,గుండు శ్రీను వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వార్తా సేకరణలో ఉండే జర్నలిస్టులకు వారికి జీతాలు తక్కువ ఉండడంతో పిల్లలకు ఫీజు రాయితీ వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు.గతంలో కూడా జర్నలిస్టులకు గత కలెక్టర్లు ఈ సదుపాయం కల్పించారని గుర్తు చేశారు.జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బాబ్జి,సతీష్,నారాయణ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పిజిఆర్ఎస్‌కు 29 ఫిర్యాదులు



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మొత్తం 29 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు – 4, కుటుంబ కలహాలు 9 మరియు ఇతర విభాగాలకు చెందినవి 16 గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులను ఆదేశిస్తూ, "ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.

# పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహుకరించిన చాంబర్ ట్రస్ట్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.66,500 విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సోమవారం అందజేసింది. పాఠశాల ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు గౌతమఘాట్ రోడ్డులోని వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ అయిన చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ తమ ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు మద్దుల మురళీకృష్ణ, గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి దేవత సుధాకర్, డైరెక్టర్లు మండవిల్లి వెంకట్రాజు (రాజా), సభ్యులు శిఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. వారు పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ మాతి సాధూ సుందర్ సింగ్, ఉపాధ్యాయులు ముత్తా సతీష్‌లకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా తెలిపారు.

# నేడు ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్లో సాంకేతిక లోపాలను సరిచేసేందుకు, ఆర్డీఎస్ఎస్ పనులు నిర్వహణ, గ్రామాలలో గల విద్యుత్ లైన్లు నిర్వహణకుగాను 16వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆలమూరుతో పాటు చింతలూరు, పెదపళ్ళ, పినపళ్ళ, సూర్యారావుపేట, సందిపూడి, కొత్తూరు, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కొత్తపేట విద్యుత్ శాఖ ఏడిఈ, ఆలమూరు ఏఈ ప్రసాద్ తెలిపారు. ఈ గ్రామాలకు సంబంధించి విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయానికి గృహ వినియోగదారులతో పాటు రైతులు, రైస్ మిల్లర్లు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

**ఈతకోట గ్రామంలోని ఐదున్నర సెంట్లు మెరక భూమిని**

# శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంనకు సమర్పించిన భక్తులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం, మందపల్లి వారికి ఈతకోట గ్రామంలోని సర్వే నెం.414/4 లోని ఐదున్నర సెంట్లు మెరక భూమిని శ్రీ స్వామి వారి మీద భక్తితో రావులపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు దేవస్థానం పేరున రిజిస్ట్రేషన్ చేయించి, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వారికి, ధర్మకర్తల మండలి సభ్యులకు సమర్పించిన ఈతకోట వాస్తవ్యులు కర్రి లక్ష్మయ్య,వారి కుమారులు కర్రి శ్రీనివాస రావు, కర్రి చంద్రరావు ఈ రోజు శ్రీ స్వామి వారి దేవస్థానమునకు వచ్చి శ్రీ స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొనియున్నారు. తదుపరి ఆలయ అర్చకులు, వేదపండితులు వారికి దుశ్శాలువాతో సత్కరించి, వేద ఆశీర్వచనం చేసి, శ్రీ స్వామి వారి శేష వస్త్రం, చిత్ర పఠమును అందజేసి యున్నారు అని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# మండలంలో పలువురు కుటుంబాలను పరామర్శించిన జక్కంపూడి రాజా



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్ఆర్‌సీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. కాటవరంలో మృతి చెందిన తాడేపల్లి జీవరత్నం, చిత్తూరు సత్యవతి,మునికూడలి గ్రామానికి చెందిన ఆరుమిల్లి సత్యవతి, మల్లాడిపోసియ్య, కూనవరం గ్రామానికి చెందిన అయ్యాల వెంకటరావు, నందూరి వెంకటరత్నం,రేలంగి రమేష్ మేడికొండ నరసమ్మ కొనకాల దుర్గ గుబ్బల అప్పారావు సిద్ధ స్వామి విష్ణు నందూరు ఏసు మూడు నెలల కుమార్తె ఇటీవల మరణించగా వారి కుటుంబాలను రాజా పరామర్శించారు. కూనవరానికి చెందిన తోరాట ఝాన్సీ, దోసపాటి సుబ్బారావు, రాయుడు రంగారావు,కుసుమల్ల చంద్రం అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వాడపల్లి, కట్టుంగ, వసంతవాడ,తాడిపూడి గ్రామాలలో**

# గో టూ విలేజ్ 40 డేస్

**మే 25 నుండి జూలై 05 వరకు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మరియు పోలిట్ బ్యూరో సభ్యులు ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ,డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎం అర్ పి ఎస్ ఇన్చార్జ్ డాన్ సూరి మాదిగ సూచనలు మేరకు వాడపల్లి,కట్టుంగ, వసంతవాడ,తాడిపూడి గ్రామాలలో గో టూ విలేజ్ 40 డేస్ కార్యక్రమాన్ని ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షుడు లకారపు చంద్ర శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎం.ఆర్.పి. ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ పాల్గొని మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు గో టు విలేజ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం,చదువు యొక్క ప్రాముఖ్యత గురించి మరియు మధ్యలో చదువు మానేసినటువంటి వారిని తిరిగి బడిలో చేర్పించే విధంగా చైతన్యం చేయడం యం ఆర్ పి ఎస్ ఉద్యమంలోకి యువతను చదువుకున్న మేధావులను విద్యావంతులను ఉద్యమంలోకి ఆహ్వానించడం, పూర్తి కానీ గ్రామ, మండల కమిటీలు వేయడం.జూలై 7 న ఎం.ఆర్.పి.ఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా ప్రతి పల్లెలో జండా దిమ్మెలు ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరణ చేయడం అన్న జన్మదిన కార్యక్రమం పండుగ వాతావరణాన్ని కల్పించే విధంగా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం ఆయా గ్రామాల్లో కార్యక్రమంనందు గ్రామ పెద్దలు సమక్షంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎం.ఎస్.పి ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు మాదిగ, ఎం.ఎస్.పి.ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు ముప్పిడి పండు, కొడమంచిలి చిరంజీవి, రాచర్ల అరుణ్ కుమార్, ఎం.ఎస్.పి ఆత్రేయపురం మండల అధ్యక్షుడు నేకూరి కృష్ణ, వి.హెచ్.పి.ఎస్ గౌరవ అధ్యక్షుడు కొల్లి కృపావరం, యువసేన అధ్యక్షుడు లంక ప్రేమ్ కుమార్, సిరిపెల్ల బాబి, పాతకోకల సారథి, పోసిపోయిన రాజు, సీనియర్లు, గ్రామ మహిళలు యువత, చదువుకున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అధిక ఫీజులు వసూలు చేస్తూ, పాఠ్యపుస్తకాలు మరియు యూనిఫాంల విక్రయాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సీతానగరం మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)కి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కార్తీక్ మాట్లాడుతూ, సీతానగరం మండలంలోని అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విక్రయిస్తూ అదనపు భారాన్ని విద్యార్థుల కుటుంబాలపై మోపుతున్నారని పేర్కొన్నారు. అలాగే కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానం, ఫైర్ సేఫ్టీ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండానే నిర్వహణ కొనసాగుతోందని తెలిపారు. విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలు అమలవుతున్నాయో లేదో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సీతానగరం మండల నాయకుడు టి. పండు, నాయకులు పి. తరుణ్, జి. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోచ్ పార్టీ అధినేత అభిజీత్ దీప్కేపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే..

**- పీడీఎస్‌యూ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాక్‌రోచ్ జనతా పార్టీ జాతీయ కన్వీనర్ అభిజీత్ దీప్కేపై జరిగిన దాడిని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. దేశంలో విద్య, ఉపాధి, పరీక్షల నిర్వహణ, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై ప్రశ్నిస్తున్న నాయకులు, ఉద్యమకారులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి ప్రజా సంఘానికి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కు ఉందని, ఆ హక్కులను భౌతిక దాడులు, బెదిరింపులు, హింసాత్మక చర్యల ద్వారా అణచివేయాలనే ప్రయత్నాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విభేదాలను వాదనలతో ఎదుర్కోవాల్సింది పోయి దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువల పతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. అభిజీత్ దీప్కేపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తు చేశారు. విద్యార్థి, యువజన, ప్రజాస్వామ్య శక్తులు ఈ దాడిని ఖండించి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. దాడిలో గాయపడిన అభిజీత్ దీప్కే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పి.జి.ఆర్.ఎస్.లపై చర్యలు శూన్యం

**అధికారుల తీరుపై ఫిర్యాదు – పట్టించుకోని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు**

**నిద్రావస్థలో జిల్లా పంచాయతీ అధికారి**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధికారుల అలసత్వంతో అపహాస్యం పాలవుతుందని తూరంగి మాజీ ఎంపీటీసీ పితాని వెంకటరాము ఆరోపించారు. అధికారుల పనితీరుపై సాక్షాత్తు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామ పంచాయితీ పరిధిలో పలు అక్రమాలపై ఫిర్యాదు చేసి సుమారు 9 నెలలకు కావస్తున్న నేటికీ వాటిపై చర్యలు శూన్యమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వీరి ఇరువురికి సగం సగం చేసిన ఎంక్వయిరీ రిపోర్టులు అన్నీ కలిపి ఇచ్చి సుమారు మూడు నెలలు అవుతున్న వీరి కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వలన ఎక్కడ ఉన్న ఫిర్యాదులు అక్కడే ఉంటున్నాయి. సోమవారం కాగానే దూర ప్రాంతాల నుండి వచ్చే ఫిర్యాదుదారులు జిల్లా కలెక్టర్ ఏదో న్యాయం చేస్తారని వస్తుంటే, వచ్చేవారికి జిల్లా ఉద్యోగస్తులు ఎంతవరకు న్యాయం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా కనిపిస్తుంది అన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థలో పెను మార్పులు తీసుకొస్తున్న మంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కాకుండా కాకినాడ రూరల్ పై కూడా దృష్టి పెడితే బాగుంటుందన్నారు. తూరంగి గ్రామపంచాయతీ లో నకిలీ ఇంటి పన్నులు, అనధికారిక కట్టడాలు, అక్రమ రిజిస్ట్రేషన్, అనధికారిక లేఅవుట్లు ఇంకా పలు అంశాలపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వంలో పబ్లిక్ గ్రీవెన్స్కు వచ్చే అర్జీదారులకు న్యాయం చేయని పక్షంలో సంబంధిత శాఖ అధికారులపై, జిల్లా అధికారులపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయుటకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము పత్రిక ముఖంగా తెలియజేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలి

**ఈఆర్వో కె.టి. సుధాకర్**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా అమలు చేసి, ప్రతి దశను సక్రమంగా నమోదు చేయాలని కాకినాడ అర్బన్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్ బీఎల్‌వో సూపర్వైజర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన నివేదికల సమర్పణ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. కాకినాడ అర్బన్ నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈఆర్వో కె.టి.సుధాకర్ మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్, ఏఈఆర్వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్‌వోలు ఇంటింటి సర్వే ద్వారా పంపిణీ చేస్తున్న ఫారాలు, వాటి స్వీకరణ, నమోదుకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ఫారాలు పంపిణీ చేశామని మౌఖికంగా చెప్పడం సరిపోదని, ప్రతి పంపిణీకి సంబంధించిన ఆధారాలు, సంతకాలు, యాప్‌లో నమోదు వంటి అంశాలు పూర్తిగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో ఫారాల పంపిణీ జరిగినప్పటికీ, వాటి వివరాలు యాప్‌లో నమోదు చేయడంలో జాప్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. పంపిణీ చేసిన ప్రతి ఫారాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, లేకపోతే పంపిణీ చేసినట్టుగా పరిగణించబడదని హెచ్చరించారు. ఎన్నికల సంఘం వ్యవస్థలో ప్రతి చర్య స్పష్టంగా నమోదవుతుందని, పనితీరు ఆధారంగా సమీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతి బీఎల్‌వో సూపర్వైజర్ రోజుకు కనీసం మూడు సార్లు తమ పరిధిలోని బీఎల్‌వోలతో సంప్రదింపులు జరిపి, వారు ఎన్ని ఇళ్లను సందర్శించారు, ఎన్ని ఫారాలు పంపిణీ చేశారు, ఎన్ని ఫారాలు తిరిగి స్వీకరించారు అనే వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అలాగే వీఆర్వోలు, ఇతర ఫీల్డ్ సిబ్బంది కూడా క్షేత్రస్థాయి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. సమీక్ష సమావేశంలో అర్బన్ తహసీల్దార్ ~జు~ా జితేంద్ర మాట్లాడుతూ, ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి ఫారం పంపిణీకి సంబంధించిన వివరాలను డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, సంబంధిత వ్యక్తుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయడం ద్వారా మాత్రమే ప్రక్రియ పూర్తయినట్లవుతుందని వివరించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం రాబోయే నెల రోజుల పాటు కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి అధికారి, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల జాబితాల స్వచ్ఛత, ఖచ్చితత్వం కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కూడా సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాస్, డీసీపీ కృష్ణారావు , డిటి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



త్వరలో మండల కేంద్రంలో

## అఖిలపక్ష నూతన కమిటీ ఏర్పాటు

సిపిఐ ఎంఎల్ పార్టీ పలివెల




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల కేంద్రం సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలివెల వీరబాబు మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో ఉన్న అన్ని పార్టీల నాయకుల నేతృత్వంలో సీతానగరం మండల కేంద్రంలో అతి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ సమావేశం నందు ఏకాగ్రేవంగా అఖిలపక్ష నాయకుడను ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన అఖిలపక్ష నాయకుడు అధికార పార్టీ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా, రాజానగరం నియోజకవర్గ ప్రజలకు అవసరమైన పనులను ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించి ప్రజలకు అండగా నిలబడడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కార దిశగా ఆ నాయకుడు పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గుండుబోగుల శ్రీను (రంగా శ్రీను), సిపిఐ ఎంఎల్ పార్టీ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు తవిటికి సునీత తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను

## పరామర్శించిన జక్కంపూడి

పలువురి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కం పూడి రాజా పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం మండలంలోని గాడాలలో ఇటీవల మృతి చెందిన జుత్తుక అప్పాయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆచంట అర్జున్‌ను రాజా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు.కాటవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన తాడేపల్లి జీవారత్నం, చిట్టూరి సత్యవతి కుటుంబసభ్యులను పరామర్శించి, అధైర్య పడద్దని జక్కంపూడి కుటుంబం అన్ని విధాలుగా అండదండగా ఉంటుందని మృతులకు కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకులు కొండపల్లి దుర్గారావు, నీరుకొండ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై కమీషనర్ టీవీ రంగారావు

## సమీక్ష సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై సోమవారం ఉదయం మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో కమీషనర్ టి.వి. రంగారావు సమీక్ష నిర్వహించారు. పట్టణ పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు లు, సూపర్ వైజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ నెల 15 నుండి వచ్చే నెల 14 వరకు ఇంటింటా సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలు పరిశీలించాలని కమీషనర్ బి ఎల్ ఓ లను ఆదేశించారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, బూత్ లెవెల్ ఏజెంట్ ల సహకారంతో ఓటర్ల సమాచారం సేకరించి ఓటును నిర్ధారించాలన్నారు. ఓటర్లు ఇచ్చిన వివరాల ఆధారంగా జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఎన్నికల కమీషన్ గైడ్ లైన్స్ ప్రకారం ప్రతి ఓటరును గుర్తించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమీషనర్ సూచించారు.

## రైతులకు పారదర్శకంగా ఎరువులు పంపిణీ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సిస్టము ద్వారా రైతులకు పారదర్శకంగా ఎరువులను పంపిణీ చేస్తుందని సీతానగరం మండల వ్యవసాయ అధికారి ఎ .గౌరీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఈ క్రాఫ్ట్ వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయ సిఫారసుల ఆధారంగా యూరియా, డిఏపి తదితర ఎరువులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రైవేట్ డీలర్లు పిఏసిఎస్, ఆర్ఎస్కె కేంద్రాలలో ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నామన్నారు. ఏ డీలర్ వద్ద ఎంత పరిమాణంలో ఎరువులు ఉన్నాయన్న వివరాలు ఎప్పటికప్పుడు రైతు సేవ కేంద్రంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఎరువుల అమ్మకాలలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పుష్కరాల సన్నాహాల్లో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోంది

**కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెడుతోంది - సుపరిపాలనతో ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్న సీఎం చంద్రబాబు**

**'మన వార్డులో - మన ఆదిరెడ్డి'తో ప్రజలకు మరింత చేరువగా ఎమ్మెల్యే - ఆదిరెడ్డి శ్రీనివాస్, కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగర అభివృద్ధి, ఆధ్యాత్మిక వైభవ పునరుద్ధరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాజమహేంద్రవరం నగర్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెన్షన్ హాల్‌లో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మీడియా నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని దేవదాయ శాఖ ద్వారా రూ.11.46 కోట్ల నిధులు మంజూరు చేయడం కూటమి ప్రభుత్వ ఆధ్యాత్మిక దృక్పథానికి నిదర్శనమన్నారు. రెండు దశలుగా నిధులు మంజూరు చేసిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అనేక దేవాలయాలు ప్రస్తుతం అభివృద్ధి బాట పట్టాయని, ఉమా మార్కండేయ స్వామి ఆలయం, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, శ్యామలాంబ అమ్మవారి ఆలయం, మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం తదితర ఆలయాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా నగరంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్, తాగునీటి ప్రాజెక్టులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రహదారుల అభివృద్ధి వంటి పలు మౌలిక వసతుల పనులు చేపట్టడం ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. ప్రజలకు చేరువగా పాలన అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేపట్టిన "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమం విశేష ప్రజాదరణ పొందుతోందని సత్తిబాబు అన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించే ఈ కార్యక్రమం భవిష్యత్తులో ఆదర్శవంతమైన ప్రజా పాలనకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతోందన్నారు. చిన్నారులతో భిక్షాటన చేయించడం వంటి సామాజిక దురాచారాల నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి నాయకులు మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాస రావు, వై శ్రీను, దొండపాటి సత్యంబాబు, యిన్నమూరి దీపు, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రవి, అడబాల రామకృష్ణ, వివిధ దేవాలయాల చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్య, ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ ద్వారా ఈ వినతిపత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ సెక్రటరీకి పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగుల సమస్యలపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని, సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు లేఖను పంపిస్తానని హామీ ఇచ్చారు. దీనికి జేఏసీ రాష్ట్ర కమిటీ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం హెచ్‌ఆర్ పాలసీని రాష్ట్రంలో అమలు చేయడం లేదని, గత నాలుగు సంవత్సరాలుగా వార్షిక ఇంక్రిమెంట్లు నిలిపివేయడం అన్యాయమని విమర్శించారు.

**ప్రధాన డిమాండ్లు:** గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలి, అందరికీ ఎమ్‌టీఎస్ అమలు చేయాలి, హెచ్‌ఆర్ సెల్ ఏర్పాటు చేసి, కేంద్ర గైడ్‌లైన్స్ ప్రకారం హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి, క్లియర్ వెకెన్సీలు, మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించాలి, కొత్త నియామక ప్రక్రియ (నోటిఫికేషన్ నెం.10/2026, తేదీ 10-06-2026) కొనసాగించే ముందు ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగులకు వన్‌టైమ్ బదిలీల అవకాశం కల్పించాలి, రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి, రిటైర్మెంట్ ప్రయోజనాలు అమలు చేయాలి, రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగులకు నష్టం కలిగించే నిర్ణయాలను ఉపసంహరించాలి, ఉద్యోగ భద్రత కల్పిస్తూ విద్యార్హతలకు అనుగుణంగా ఖాళీలలో సర్దుబాటు చేయాలి, ఒకే క్యాడర్‌లో ఉన్న ఉద్యోగులకు సమాన వేతనం అమలు చేయాలి, అన్ని కేటగిరీల ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలి, హైకోర్టు తాజా తీర్పు ప్రకారం ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగులందరికీ న్యాయం చేయాలి, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఎల్‌జీఎస్‌లకు గతంలో మాదిరిగా శానిటేషన్ ఫండ్ విడుదల చేయాలి, కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి సర్వీస్ వెయిటేజీ కల్పించాలి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి, ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌హెచ్‌ఎమ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డి. దయామణి, యూనియన్ నాయకులు సూర్యరాణి, కనక, లక్ష్మి, మూర్తి, సింధియా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌హెచ్‌ఎమ్ జేఏసీ



# కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలి

**కనీస వేతనాల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి - ఐఎఫ్‌టీయూ నగర కౌన్సిల్ తీర్మానం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రగతిశీల ఆటో మొబైల్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) రాజమహేంద్రవరం నగర కౌన్సిల్ సమావేశం స్థానిక "మావో భవన్"లో ఘనంగా జరిగింది. ఆటో మొబైల్, మెకానికల్, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన కార్మిక ప్రతినిధులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకత్వం పాల్గొని కార్మిక ఉద్యమాల ప్రాధాన్యతను వివరించింది. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరావు నూతన నగర కమిటీని ప్రకటించారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, ఉద్యోగ భద్రత లోపించడం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ హక్కులు అమలు కాకపోవడం, కాంట్రాక్ట్ విధానం పేరుతో దోపిడీ పెరగడం వంటి అంశాలపై సంఘటిత పోరాటాలు అవసరమని తెలిపారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు: పి. టాన్య, అడ్వైజర్: ఎస్. కిరణ్ కుమార్, అధ్యక్షులు: వి. రాజు, ఉపాధ్యక్షులు: ఉడిముడి సత్తిరాజు, ప్రధాన కార్యదర్శి: నందూరి సతీష్, సహాయ కార్యదర్శి: మాసా చిన్న, కోశాధికారి: మారడపూడి శివ, అదేవిధంగా వివిధ వర్క్‌షాప్‌లు, గ్యారేజీలు, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన కార్మిక ప్రతినిధులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

**సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు:**

కనీస వేతనాల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. కాంట్రాక్ట్ కార్మికుల దోపిడీని అరికట్టాలి. ప్రమాద బీమా, భద్రతా ప్రమాణాలను అమలు చేయాలి. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలి. యూనియన్ సభ్యత్వ విస్తరణ చేపట్టి కార్మికులను సంఘటితం చేయాలి. సమావేశంలో పాల్గొన్న నాయకులు "కార్మికుల ఐక్యతే దోపిడీ వ్యవస్థకు సమాధానం - పోరాటమే హక్కుల సాధనకు మార్గం" అని పేర్కొన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం యూనియన్ ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి హక్కులు సాధించుకుంటామని స్పష్టం చేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై

## చర్యలు తీసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు రాష్ట్ర యువజన అధ్యక్షుడు అరే రాము డిమాండ్



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు పేద, మధ్య తరగతి కుటుంబాలపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని, పుస్తకాలు, యూనిఫారాలు పేరుతో కూడా భారీ మొత్తాలు వసూలు చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఆరే రాము ఆరోపించారు. ఆయన ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను సైతం అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదని, తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చేశారని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఫీజుల వివరాలతో కూడిన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను కేటాయించే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రేపటి నుంచి జిల్లాలోని ప్రతి ప్రైవేట్ పాఠశాల, కళాశాలను తమ సంస్థ ఆధ్వర్యంలో సందర్శిస్తామని, తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసిన యాజమాన్యాలపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆరే రాము మీడియా ద్వారా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన ప్రజావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లు జయరాజ్, మాల మహానాడు సిటీ వైస్ ప్రెసిడెంట్ మడికి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జీలు తనిఖీలు చేసిన పోలీసులు

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మా లక్ష్యం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నంసింహ కిషోర్, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు లాడ్జీలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా లాడ్జీలలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, గుర్తింపు పత్రాల ధృవీకరణ, సీసీ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన వివరాలు నమోదు చేయకుండా గదులు కేటాయించరాదని నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అదేవిధంగా, లాడ్జీకు వచ్చే ప్రతి వ్యక్తి నుండి చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాన్ని తప్పనిసరిగా సేకరించాలని, వారి పూర్తి వివరాలను నమోదు చేయాలని, లాడ్జీలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా చూడాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, అనైతిక కార్యకలాపాలు లేదా చట్టవ్యతిరేక చర్యలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని నిర్వాహకులను కోరారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల సంచారాన్ని గుర్తించడం, నేరస్థులకు ఆశ్రయం లభించకుండా నిరోధించడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతీ ఒక్కరి ఓటు కాపాడే బాధ్యత

## బిఎల్‌ఎలదే : ఎమ్మెల్సీ తోట




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** జాతీయ ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ప్రతీ ఒక్కరి ఓటును కాపాడేందుకు కృషి చేయాలని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై వైసీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ)లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. విజయలక్ష్మి నగర్లోని వైసీపీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని మూడు మండలాల బీఎల్ఏ లతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియలో కూటమి నేతల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైన ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిఘటించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నప్పటికీ ఇటీవల ఐదు రాష్ట్రాలలో జరిగిన తీరును బట్టి అధికారపక్షం ప్రతిపక్షం ఓట్లను గల్లంతు చేసే ఘాతుకానికి పాల్పడినట్టు స్పష్టమైందన్నారు. అలాంటి నేపథ్యంలో స్థానికంగా ప్రతీ ఒక్కరి ఓటును కాపాడేందుకు వైసీపీ బీఎల్ఏ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 13 ధృవ పత్రాలలో ఏ ఒక్క పత్రం చూపించిన ఓటు నిలబడుతుందన్నారు స్థానికంగా అందుబాటులో లేకపోతే ఆయా పత్రాలలో ఏదో ఒకటి బంధువుల ద్వారా చూపించిన ఓటు నిలబడుతుందని ఆయన అన్నారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తిన ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారుల సమక్షంలో ఓటు హక్కును కాపాడేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాధాకృష్ణ, దూలం వెంకన్నబాబు, అర్బన్ రూరల్ కన్వీనర్లు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి, నాయకులు మల్లువలస గణపతి, గూటం సత్యనారాయణ,యరామాటి వెంకన్నబాబు,ఏలేటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# సంగీత సంచలనం అనిరుధ్ కొత్త పాట వచ్చేసింది

## ఒక్కసారి వింటే మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుంది



సంగీత సంచలనం..రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఆయన తన సొంత ఇండిపెండెంట్ లేబుల్ అల్బుకర్కీ రికార్డ్స్‌తో పాటు యూనివర్సల్ మ్యూజిక్ ఇండియాతో కలిసి చేసిన 'అరవింద్' పాటను రిలీజ్ చేశారు. ఈ కాంబోలో రిలీజైన తొలి పాట ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఒరిజినల్ పాప్, హిప్ హాప్ ఆధారంగా రూపొందిన ఈ ట్రాక్‌తో అనిరుద్ తన సంగీత ప్రపంచంలోని పరిధిని దాటి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. 2012లో విడుదలైన వైరల్ హిట్ 'వై దిస్ కొలవెరి డి' ద్వారా అనిరుద్ దేశవ్యాప్తంగా పాపులారిటీ పొందిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత దక్షిణాదిన జైలర్, కూలీ, విక్రమ్, లియో, దేవర పార్ట్ వన్ వంటి పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతాన్ని అందించారు. అలాగే 2025లో షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి కూడా సంగీత దర్శకుడిగా అక్కడ కూడా బ్లాక్ బస్టర్ అందుకున్నారు. అనిరుద్..చాలా ఏళ్ల కష్టంతో చిన్న స్థాయి నుంచి అసాధారణ స్థాయికి ఎదిగి అభిమానులతో పాటు సినీ ఇండస్ట్రీ నుంచి కూడా రాక్‌స్టార్ అనే బిరుదుని సంపాదించుకున్నారు. ఇక అరవింద్ పాట విషయానికి వస్తే.. వేగంగా మారుతోన్న డిజిటల్ సంగీత ప్రపంచంలో తన ప్రతిభను నిరూపించుకోవటానికి ఓ ఇండిపెండెంట్ ఆర్టిస్ట్ పడే కష్టాలను ప్రధానంగా ఆవిష్కరించారు అనిరుద్. ఈ పాట కథలో కేంద్రంగా నిలిచే పాత్ర పేరు అరవింద్. అనిరుధ్‌కి ప్రతిబింబంలాంటి పాత్ర ఇది. ఈగో, ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు ఎదురైనా, సంగీతంపై ఉన్న ప్యాషన్‌తో తన జీవితాన్ని పూర్తిగా దానికి అంకితం చేసిన యువ సంగీతకారుడే అరవింద్. ఇప్పటి డిజిటల్ యుగంలో పాటలను విడుదల చేయటం చాలా సులభం. అయితే దక్షిణ భారత సినీ రంగంలో ఇండిపెండెంట్ ఆర్టిస్ట్‌గా ప్రతిభను నిరూపించుకుంటూ కెరీర్‌ను కొనసాగించడం మాత్రం అంత సులువైన విషయం కాదు. అయినప్పటికీ ఏదో ఒక రోజు తన సంగీతం ప్రేక్షకులను చేరుకుంటుందనే నమ్మకంతో అరవింద్ ముందుకు సాగుతుంటాడు. ఈ సందర్భంగా అనిరుద్ మాట్లాడుతూ "'అరవింద్' అంటే ప్రతి ఒక్కరిలో ఉండే ఓ తరహా వ్యక్తిత్వమే. మన అందరి జీవితాల్లో ఓ అరవింద్ ఉంటాడు. అయితే తన ప్రతిభను చూపించడానికి ఒక్క అవకాశం కోసం ఎదురుచూస్తోన్న ఓ స్వతంత్ర కళాకారుడి కథను ఈ పాట చెబుతుంది. అలాగే నేటి డిజిటల్ ప్రపంచంలో ఉన్న విపరీతమైన పోటీలో పెద్ద స్థాయికి చేరుకునే సమయంలో ఒక ఇండిపెండెంట్ ఆర్టిస్ట్ ఎదుర్కొనే సవాళ్లను ఇది చూపిస్తుంది" అన్నారు. ఈ పాటకు అనిరుధ్‌కు వ్యక్తిగతంగా కనెక్టింగ్‌గా ఉంటుంది. ఎందుకంటే తను కూడా జీవితంలో ఒకప్పుడు అరవింద్ వంటి దశను ఎదుర్కొన్నవాడే. ఈ పాట ద్వారా ఇలాంటి ప్రయాణంలో ఉన్న ఇతర కళాకారులు, క్రియేటివ్ వ్యక్తులతో అనుబంధం ఏర్పరచుకోవాలని ఆయన ఆశిస్తున్నారు. అలాగే తన ఎదుగుదల, ఎదురైన సవాళ్లు, అలాగే మొత్తం ఇండస్ట్రీ పై ధైర్యంగా, ఆత్మపరిశీలనతో కూడిన వ్యాఖ్యలను కూడా ఈ పాట ద్వారా తెలియజేస్తున్నారు. అల్బుకర్కీ రికార్డ్స్ ద్వారా రాబోయే రోజుల్లో వివిధ రకాలైన ఇండిపెండెంట్ మ్యూజిక్ ప్రాజెక్ట్స్ , కాన్సెప్చువల్ ప్రాజెక్ట్స్‌ను డెవలప్ చేసి రిలీజ్ చేయటానికి అనిరుద్ సిద్ధమవుతున్నారు.

## వెల్‌కమ్ గర్ల్ నుండి కోట్లు తీసుకునే స్టార్ వరకు..

# సమంత సక్సెస్ జర్నీ!



సినిమా రంగంలో గాడ్‌ఫాదర్ లేకుండా అడుగుపెట్టి, కేవలం స్వయంకృషితో తిరుగులేని సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న నటీమణులలో సమంత రుత్ ప్రభు అగ్రస్థానంలో నిలుస్తుంది. ఈ రోజు దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుని, అత్యున్నత స్థాయి స్టార్‌డమ్‌ను ఆస్వాదిస్తున్న సమంత జీవితం వెనుక ఎవరూ ఊహించని ఎన్నో కష్టాలు, కన్నీళ్లు ఉన్నాయి. ఆమె ఎదుగుదల ఒక అద్భుతమైన సినిమా కథను తలపిస్తుంది. చిన్నతనంలో తీవ్రమైన పేదరికాన్ని అనుభవించిన ఈమె, నేడు యావత్ భారత చిత్ర పరిశ్రమ తన వైపు తిరిగి చూసేలా ఒక తిరుగులేని శక్తుగా ఎలా ఎదిగిందో చూడటం ప్రతి ఒక్కరికీ ఒక పెద్ద మోటివేషన్. సమంత కెరీర్ ప్రారంభంలో అస్సలు పూలపాన్పు కాదు. మధ్యతరగతి కన్నా దిగువ స్థాయి కుటుంబం నుండి వచ్చిన సమంత, చదువుకునే రోజుల్లో తన సొంత ఖర్చుల కోసం పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది. ఆ క్రమంలోనే కేవలం 500 రూపాయల కోసం హోటళ్లు, ఫంక్షన్లలో వెల్‌కమ్ గర్ల్‌గా కూడా పనిచేసింది. కేవలం పాకెట్ మనీ కోసం మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, తన అందం, అభినయంతో త్వరగానే గుర్తింపు తెచ్చుకుంది. తమిళ, తెలుగు భాషల్లో చిన్న చిన్న పాత్రలతో మొదలైన ఆమె ప్రయాణం, 'ఏ మాయ చేసావె' సినిమాతో సరికొత్త మలుపు తిరిగింది. ఆ తర్వాత విజయ్, సూర్య, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి టాప్ హీరోయిన్‌గా స్థిరపడింది. సమంత కెరీర్‌లో అత్యంత పెద్ద మైలురాయి 'పుష్ప' సినిమాలోని స్పెషల్ సాంగ్. 'ఊ అంటావా మావా.. ఊఊ అంటావా' అంటూ ఆమె వేసిన స్టెప్పులు ప్రపంచవ్యాప్తంగా ఒక సంచలనాన్ని సృష్టించాయి. కేవలం మూడు నిమిషాల నిడివి గల ఈ ఒక్క పాట కోసం సమంత ఏకంగా ఐదు కోట్ల రూపాయల పారితోషికాన్ని అందుకుంది. ఒక ప్రత్యేక గీతం కోసం ఈ స్థాయిలో రెమ్యూనరేషన్ తీసుకున్న మొట్టమొదటి సౌత్ ఇండియన్ హీరోయిన్‌గా ఆమె సరికొత్త రికార్డును నెలకొల్పింది. ప్రస్తుతం కేవలం కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకుం డా, హీరోలతో సమానంగా లేడీ ఓరియెంటెడ్ మరియు హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రాల్లో నటిస్తూ తన సత్తా చాటుతోంది. ఆమె ప్రయాణంలో వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడు కులు, విడాకులు మరియు 'మయోసైటిస్' వంటి ప్రాణాం తక ఆరోగ్య సమస్యలు ఎదురైన ప్పటికీ ఆమె ఎక్కడా వెనకడుగు వేయలేదు. మానసిక దృఢత్వంతో వాటన్నింటినీ ఎదిరించి మళ్లీ మరింత బలంగా ఇండస్ట్రీలోకి కమ్‌బ్యాక్ ఇచ్చింది. నేడు అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్లలో ఒకరిగా నిలవడమే కాకుండా, ఎందరో మహిళలకు ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. కష్టాలు శాశ్వతం కాదని, గుండెనిండా సంకల్పం ఉంటే ఎంతటి పేదరికం నుండైనా కోట్లకు అధిపతి కావచ్చు అని సమంత తన జీవితం ద్వారా నిరూపించింది.

# స్పెషల్ బుధవారం.. ఉదయం 10 నుంచి రాత్రి 11 వరకు వారికి పండగే..



ఇండియన్ క్రికెట్ హిస్టరీలో ఓ ప్రత్యేకమైన బుధవారం రాబోతోంది. ఈ నెల 17న భారత క్రికెట్ అభిమానులంతా దాదాపు 12 గంటలపాటు క్రికెట్‌లో మునిగి తేలబోతున్నారు. ఎందుకంటే ఆ రోజు భారత జట్లు వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడబోతున్నాయి. ఏంటా మ్యాచ్‌లు.. ఏమా సందడి చూద్దామా!

జూన్ 17న టీమ్ ఇండియా సీనియర్లు, భారత అమ్మాయిలు, ఇండియా - ఎ జట్టుకు సంబంధించిన మ్యాచ్‌లు జరగబోతున్నాయి. అమ్మాయిల మ్యాచ్ టీ20 కాగా, అబ్బాయిల మ్యాచ్‌లు వన్డేలు.

ఉదయం 10 గంటలకు భారత్ ఎ × అఫ్గానిస్థాన్ ఎ మ్యాచ్ జరగనుంది. ఇందులో భారత జట్టును తిలక్ వర్మ లీడ్ చేస్తున్నాడు. శ్రీలంక 'ఎ', అఫ్గానిస్థాన్ 'ఎ'తో జరుగుతున్న ఈ ముక్కోణపు టోర్నీలో భారత్ ఫైనల్‌కి వెళ్లాలంటే ఈ మ్యాచ్‌లో ఫలితం కీలకం కావొచ్చు.

మధ్యాహ్నం 1.30 గంటలకు అఫ్గానిస్థాన్ సీనియర్ జట్టుతో శుభ్‌మన్ గిల్ సేన తలపడనుంది. ఇప్పటికే ఈ 3 వన్డేల సిరీస్‌లో ఓ మ్యాచ్‌లో గెలుపొందిన టీమ్ ఇండియా ఇందులోనూ నెగ్గి కప్ గెలిచే ప్రయత్నంలో ఉంది.

అదే రోజు రాత్రి 7 గంటలకు మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్ ఉంది. ఇందులో నెదర్లాండ్స్ అమ్మాయిలతో భారత అమ్మాయిలు పోటీ పడనున్నారు. పాకిస్థాన్‌పై నెగ్గిన జోష్‌లో ఉన్న మన అమ్మాయిలు ఇందులోనూ గెలిచి కీలకమైన సౌతాఫ్రికా మ్యాచ్‌కు విజయంతో వెళ్దాం అను కుంటున్నారు.

# ఇండియా ఎ పై సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఎ విజయం



ముక్కోణపు సిరీస్‌లో భాగంగా సోమవారం ఇండియా ఎతో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక ఎ విజయం సాధించింది. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్‌లో ఫలితం తేలింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యఛేదనలో శ్రీలంక ఏ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. ఆఖరి ఓవర్లో లంక విజయానికి ఐదు పరుగులు అవసరం కాగా.. అర్షద్ ఖాన్ తొలి ఐదు బంతుల్లో మూడే రన్స్ ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. చివరి బంతికి శ్రీలంక విజయ సమీకరణం రెండు పరుగులు కాగా.. ఒక రన్ (లెగ్ బై) పూర్తయిన తర్వాత గుణశేఖర (18) రనౌటయ్యాడు. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో శ్రీలంక 16 పరుగులు చేయగా.. భారత్ 9 పరుగులే చేసింది. 265 పరుగుల లక్ష్యఛేదనలో లంక ఇన్నింగ్స్ 10/0తో మొదలుపెట్టింది. భారత బ్యాటర్ విప్రాజ్ నిగమ్ డేంజర్ ఏరియాలోకి రావడంతో అంపైర్లు పది పరుగులను పెనాల్టీగా విధించి.. శ్రీలంక ఇన్నింగ్స్‌కు కలిపారు. ఈ పెనాల్టీ లేకపోతే మ్యాచ్ ఫలితం మరోలా ఉండేది. లంక బ్యాటర్లలో సదీర సమరవిక్రమ (83; 102 బంతుల్లో 6 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. నిరోషన్ డిక్వెల్లా (37), వనుజ సహన్ (25), అవిష్క ఫెర్నాండో (22), విశేన్ (17) పరుగులు చేశారు. భారత బౌలర్లలో ఆయుష్ బదోని 2, అర్షద్ ఖాన్, నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, అనుకుల్ రాయ్, సుర్యాంశ్ ఒక్కో వికట్ పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఏ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో ఒక్కరూ కూడా హాఫ్ సెంచరీ చేయలేదు. 125 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన జట్టును సుర్యాంశ్ షెడ్జే (72; 66 బంతుల్లో), విప్రాజ్ నిగమ్ (51; 49 బంతుల్లో) ఆదుకున్నారు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (21; 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్), ప్రభ్‌సిమ్రన్ (11) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. కెప్టెన్ తిలక్ వర్మ (23), వైస్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (37) భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయారు. చివర్లో సుర్యాంశ్, విప్రాజ్ జట్టును ఆదుకున్నారు. శ్రీలంక బౌలర్లలో విజయ్‌కాంత్ 3, షిరాజ్ 3.. సహన్, ముతులన్, వనుజా సహన్ తలో వికెట్ తీశారు.

# అవును.. విరాట్ అహంకారే.. కానీ

## రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు



టీమ్‌ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ - మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి మధ్య అనుబంధం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విరాట్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు రవిశాస్త్రి ప్రధాన కోచ్‌గా బాధ్యతలను నిర్వర్తించాడు. వీరిద్దరి హయాంలో భారత్ విదేశాల్లో అద్భుతమైన టెస్టు విజయాలను నమోదు చేసింది. తాజాగా ఓ వీడియోలో విరాట్‌ను అహంకారి, అతి గారాబంతో పెరిగిన పిల్లాడు అంటూ పెట్టిన పోస్టుపై రవిశాస్త్రి స్పందించాడు. అవును ఆ అభిప్రాయాలు నిజమే కావొచ్చని.. అదంతా క్రికెట్ మైదానానికి మాత్రమే పరిమితమని స్పష్టంచేశాడు. గేమ్‌లోకి దిగిన ప్లేయర్.. మైదానం ఆవల ఉండే కోహ్లీ పూర్తి భిన్నమని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. "అవునండీ.. మీరు అనుకున్నట్లు విరాట్ అహంకారి. అతి గారాబంగా పెరిగిన కుర్రాడు. మితిమీరిన ప్రవర్తన కలిగిన వ్యక్తి. ఉద్రేకంగా ఉంటాడు. ఇవన్నీ నిజమే. కానీ, ఇలా ఉండేది మాత్రం మైదానంలోనే. ఒక్కసారి గేమ్ నుంచి బయటకు వచ్చాక పూర్తి భిన్నం. మైదానంలో అలా ఉండి.. ఒక్కసారిగా దాన్నుంచి బయటకొచ్చి సాధారణంగా ఉండే వ్యక్తులంటే నాకు చాలా ఇష్టం" అని రవిశాస్త్రి తెలిపాడు. గాయం కారణంగా విరాట్ కోహ్లీ అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కూ దూరమైన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో ఆర్సీబీకి వరుసగా రెండో కప్పు రావడంలో కోహ్లీదే కీలక పాత్ర. ఫైనల్‌లో అద్భుత ఇన్నింగ్స్‌తో తన జట్టును గెలిపించాడు. అయితే, తొడ కండరాలు పట్టేయడంతో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్‌లో ఆడటమే తన లక్ష్యమని ఇప్పటికే స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్ తరఫున కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నాడు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com